

టీసీఎస్ ఆపరేషన్లకు గ్రీన్‌సిగ్నల్

- మిలీనియం టవర్స్ డీనోటిఫై
- ప్రత్యేక ఆర్థిక మండలి నుంచి మినహాయింపు



విశాఖపట్నంలో తక్షణమే కార్యకలాపాలు ప్రారంభించడానికి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు మార్గం సుగమమైంది. ... వివరాలు మెయిన్‌లో

హౌసింగ్ ఖాళీ!

మూడు జిల్లాల్లోనూ అధికారులు, సిబ్బంది కొరత

- డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఉండాల్సింది 15 మంది, ఉన్నది నలుగురే...
- అసిస్టెంట్ ఇంజనీర్లు ఉండాల్సింది 49 మంది... ఉన్నది తొమ్మిదిమందే
- వర్క్ ఇన్‌స్పెక్టర్లు 60 మందికిగాను ఉన్నది నలుగురైదుగురు
- కార్యాలయాల్లో మేనేజర్లు, అకౌంట్స్ అధికారులు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పోస్టులు చాలావరకూ ఖాళీ
- అవుట్ సోర్సింగ్ సిబ్బందితో కాలక్షేపం
- ఇళ్ల నిర్మాణంలో జాప్యం



విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సుమారు నాలుగున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ తన ప్రాభవాన్ని కోల్పోతోంది. చాలాకాలం నుంచి నియామకాలు లేకపోవడంతో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో అధికారులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. మూడు జిల్లాల పరిధిలో ప్రస్తుతం రెగ్యులర్ పోస్టులలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, నలుగురు డీఈఈలు, తొమ్మిది మంది ఏఈఈలు, నలుగురైదుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే పనిచేస్తున్నారు. జిల్లా కార్యాలయాల్లో రెగ్యులర్ సిబ్బంది వేళ్ల మీద లెక్కపెట్టేంత మందే ఉన్నారు.

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టుల్లో రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్న డిప్యూటీ కలెక్టర్లు నియమితులు కాగా అల్లూరి జిల్లా పీడీగా, ఈఈగా హౌసింగ్ డీఈ హోదా కలిగిన అధికారి వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ, నర్సీపట్నం డివిజన్‌లకు మాత్రమే రెగ్యులర్ ఈఈలు కొనసాగుతున్నారు. వీరిద్దరూ ఈ ఏడాది జూలై/ఆగస్టు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. ఇక పాడేరు, అనకాపల్లి, భీమిలి డివిజన్‌లలో ఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు 15 మంది ఉండాలి. కానీ గాజువాక, పాడేరులో ఒక్కొక్కరు, అనకాపల్లి జిల్లాలో ఇద్దరు మాత్రమే మిగిలారు. మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ ఇంజనీర్‌లు 49 మంది ఉండాలి. కానీ ప్రస్తుతం మూడు జిల్లాల్లో తొమ్మిది మాత్రమే మిగిలారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు 60 మంది వరకూ రెగ్యులర్ విధానంలో పనిచేసేవారు ఉండాలి. ఇప్పుడు కేవలం నలుగురు నుంచి ఐదుగురు మాత్రమే మిగిలారు. అదేవిధంగా జిల్లా కార్యాలయాల్లో మేనేజర్లు, అకౌంట్స్ అధికారులు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పోస్టులలో చాలావరకూ ఖాళీగా ఉన్నాయి. డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. ఇంకా కార్యాలయాల్లో మరికొన్ని కేడర్లు, క్షేత్రస్థాయిలో ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా అవుట్ సోర్సింగ్ విధానంలో పలువురు పనిచేస్తున్నారు.

ప్రస్తుతం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఒక్క విశాఖ జిల్లాలోనే 1.3 లక్షల ఇళ్లు, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మరో 30 వేల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి రెండు వేల ఇళ్లకు ఒక ఏఈ, పది వేల ఇళ్లకు డీఈ హోదా ఉండే అధికారి ఉండాలి. కానీ విశాఖ నగర శివారు ప్రాంతాల్లో 65 లేఅవుట్‌లలో 1.3 లక్షల ఇళ్లు మంజూరుకాగా తొలి విడతలో రమారమి లక్ష ఇళ్లు పనులు కొనసాగుతున్నాయి. నాలుగు గ్రామీణ మండలాలు, నగరంలో సొంత స్థలాల్లో మరో పది వేల ఇళ్ల వరకూ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాల పురోగతిని కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ...జాప్యంపై అసంతృప్తి వ్యక్తంచేస్తోంది. క్షేత్రస్థాయిలో లేఅవుట్‌లలో ఇళ్ల ... మిగతా 6వ పేజీలో

కలెక్టర్ కావాలన్న లక్ష్యంతోనే...

- రెండుసార్లు విఫలమైనా నిరుత్సాహపడలేదు...
- మూడో ప్రయత్నంలో 975 ర్యాంకు వచ్చింది
- మళ్లీ ప్రయత్నిస్తా
- స్పష్టమైన ప్రణాళిక, అంకితభావంతో కూడిన ప్రయత్నంతో విజయం సాధ్యం
- సివిల్స్‌లో 975 ర్యాంకు సాధించిన రావాడ సాయి మోహిని మానస



రావాడ సాయి మోహిని మానస

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): "చిన్నప్పటి నుంచి కలెక్టర్ కావాలన్నది నా కోరిక. రెండుసార్లు ప్రయత్నించి విఫలమైనా నిరుత్సాహపడకుండా ప్రయత్నించాను. మూడోసారి మంచి ర్యాంకు వచ్చింది. కలెక్టర్ కావడమే లక్ష్యంగా మరోసారి ప్రయత్నిస్తా"...అని పేర్కొన్నారు డాక్టర్ రావాడ సాయిమోహిని మానస. మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 975వ ర్యాంకు సాధించిన ఆమె 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

మెడిసిన్ నుంచి సివిల్స్ వైపు..

మాది శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల గ్రామం. తల్లిదండ్రులు ప్రకాశరావు, ఉషారాణి. నాన్న కోర్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తారు. అమ్మ రాజాం ఏరియా ఆస్పత్రిలో హెడ్ నర్సు. పదో తరగతి వరకు శ్రీకాకుళం శార్వాణీ స్కూల్‌లో, ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్య కాలేజీలో చదువుకున్నా. అనంతరం ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ 2021లో పూర్తిచేశాను.

రోల్ మోడల్ టీఎన్ శేషన్

మొదటి నుంచి సివిల్స్ ... మిగతా 6వ పేజీలో

ఫిల్మ్ క్లబ్‌లో రాజకీయాలు!

రాజకీయ నేతలే అధ్యక్షులుగా ఉండేలా చక్రం తిప్పుతున్న వైసీపీ కోటరీ

- అలాగైతేనే ప్రభుత్వం భూమి కేటాయిస్తుందని ప్రచారం
- చిత్రసీమకు చెందినవారే నాయకత్వం వహించాలంటున్న మరో వర్గం
- నగరంలో ఉన్న ఏ క్లబ్‌లోనైనా రాజకీయ నాయకులు నాయకత్వ స్థానంలో ఉన్నారా?...అంటూ ప్రశ్నలు



ఫిల్మ్ క్లబ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (ఫిల్మ్ క్లబ్)కు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో రాజకీయాలు జోరుగా నడుస్తున్నాయి. ఎవరో ఒక రాజకీయ నాయకుడు క్లబ్ అధ్యక్షుడిగా ఉంటే తప్ప ప్రభుత్వం భూమి కేటాయించదంటూ కొందరు ప్రచారం చేస్తున్నారు. దీనిని మరో వర్గం వ్యతిరేకిస్తోంది. తొట్లకొండ వద్ద గతంలో ప్రభుత్వం భూమి కేటాయించిందని, అప్పుడు ఏ రాజకీయ నాయకుడు క్లబ్‌కు నాయకత్వం వహించారని ప్రశ్నిస్తోంది. వైసీపీ హయాంలో కార్యవర్గంలో చేరిన కొందరు రాజకీయ నాయకులు, వారి అనుచరులు ఇకపై కూడా తెర వెనుక ఉండి అధికారం చలాయించడానికి యత్నిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే కూటమి నాయకులను మచ్చిక చేసుకొని, వారిని క్లబ్‌కు నాయకత్వం వహించాలని ఒత్తిడి పెడుతున్నట్టు సమాచారం. ఎన్నికలు నిర్వహించకుండా ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.

నామినేషన్ల వ్యవహారంలో సస్పెన్షన్

ఇటీవల క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించడానికి నామినేషన్లు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కోశాధికారిగా వ్యవహరిస్తున్న వ్యక్తి క్లబ్ జనరల్ మేనేజర్‌తో బ్యాలెట్ బాక్స్ తెరిపించి నామినేషన్ కవరు ఒకటి బయటకు తీయించారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో ఎన్నికలను రద్దు చేశారు. విచారణ నిర్వహించారు. సంబంధిత వ్యక్తి ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో మూడు నెలల పాటు క్లబ్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ఈ నెల 15వ తేదీన ప్రకటించారు.

కాయల వెంకటరెడ్డి బృందం కీలకం

త్వరలో క్లబ్‌కు ఎన్నికలు నిర్వహిస్తామని, పారదర్శకంగా ఉంటాయని భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇటీవల క్లబ్‌ను సందర్శించిన సమయంలో ప్రకటించారు. అయితే ఈ ఎన్నికల్లో రాజకీయ నాయకులనే అధ్యక్షులుగా పోటీకి దింపాలని గత చైర్మన్ కాయల వెంకటరెడ్డి బృందం యత్నిస్తోంది. విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును అధ్యక్షునిగా పోటీ చేయాలని ఒత్తిడి పెడుతోంది. అలాంటి నాయకులు క్లబ్‌కు అధ్యక్షులుగా ఉంటే ప్రభుత్వం త్వరగా భూమి కేటాయిస్తుందని ఆ బృందం అనధికార వాట్సాప్ గ్రూపులో ప్రచారం చేస్తోంది.

చిత్రసీమవారే ఉండాలి

ఇది ఫిల్మ్ క్లబ్ కాబట్టి ... మిగతా 6వ పేజీలో

26 నుంచి ఏయూ శతాబ్ది వేడుకలు ప్రారంభం

- అదేరోజు ఉదయం బీచ్‌రోడ్డులో భారీ వాక్‌థాన్

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు సంబంధించి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మంగళ వారం సెనేట్ హాల్‌లో కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వర్సిటీలోని వివిధ కాలేజీల ప్రిన్సిపాల్స్, హాస్టళ్ల వార్డెన్లు హాజరయ్యారు. ఈ నెల 26 నుంచి శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రారంభ వేడుకలను ఎలా నిర్వహించాలన్న ఈ సమావేశంలో చర్చించారు. 26న ఉదయం బీచ్‌రోడ్డులో భారీ వాక్‌థాన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వాక్‌థాన్‌లో వర్సిటీలోని వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులతోపాటు బయట విద్యాసంస్థల నుంచి విద్యార్థులు భారీగా హాజరయ్యేలా చూడాలని వీసీ సూచించినట్టు తెలిసింది. వీటితోపాటు ఇతర అంశాలపైనా ఈ సమావేశంలో చర్చించారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా కేకే రాజు



విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కేకే రాజును నియమిస్తూ పార్టీ అధిష్ఠానం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన 2019, 2024 ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. కాగా ఇంతవరకూ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన గుడివాడ అమర్‌నాథ్‌ను అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా అధిష్ఠానం నియమించింది. కేకే రాజు నియామకం పట్ల పార్టీనేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ డీఎఫ్ఓ పోస్టు కోసం పైరవీలు

- ఆరోపణలు కలిగిన ఓ అధికారి యత్నాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) అర్బన్ డీఎఫ్ఓగా రావడానికి ఆరోపణలు కలిగిన ఒక అధికారి యత్నిస్తున్నారు. ఇక్కడి డీఎఫ్ఓ శాంతిస్వరూప్ డిప్యుటేషన్ కాలం ముగియడంతో నాలుగు నెలల క్రితం మాతృశాఖకు వెళ్లిపోయారు. దాంతో అదే విభాగంలో రేంజర్‌గా పనిచేస్తున్న సుజాత శివానీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రెండు నెలల క్రితం సోమసుందరం అనే అధికారి డీఎఫ్ఓగా రాగా ఆయన్ను విధుల్లో చేర్చుకున్నారు. అయితే తాను వేరే అధికారిని సిఫారసు చేశానని, విధులు నిర్వహించడానికి వీల్లేదని ఓ ఎమ్మెల్యే అంగీకరించకపోవడంతో ఆయన ఆ మరుసటిరోజే వెనక్కి వెళ్లిపోయారు. దాంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంది. తాజాగా ప్రకాశం జిల్లాలో అసిస్టెంట్ కన్సర్వేటర్‌గా పనిచేస్తున్న ఒకరు పెద్దల సిఫారసుతో ఇక్కడికి రావడానికి యత్నిస్తున్నారు. ఆయనపై గతంలో అనేక కేసులు ఉన్నాయని సమాచారం. అలాగే అటవీ భూమి పరాధీనం కావడానికి సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. వీఎంఆర్‌డీఏకు అలాంటి అవినీతి అధికారులను ఎలా కేటాయిస్తారని ఇక్కడి పాలకులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్లపై మళ్లీ దుకాణాలు

- పూర్ణామార్కెట్ ప్రాంతంలో తిరిగి ఆక్రమణలు
- ఆశీలు కాంట్రాక్టర్ ప్రోద్బలం
- చోద్యం చూసిన పోలీస్, జీవీఎంసీ అధికారులు
- కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గడమే కారణమని ఆరోపణలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వన్‌టౌన్‌లోని పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డులో మళ్లీ ఆక్రమణలు వెలిశాయి. రోడ్డుపై దుకాణాల ఏర్పాటు వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తుతుందని ఫిర్యాదులు అందడంతో ఇటీవల నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి స్వయంగా ఆ ప్రాంతానికి వెళ్లి ఆక్రమణలను తొలగింపజేశారు. ఏం జరిగిందో తెలియదుగానీ మంగళవారం మళ్లీ రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేయడం చర్చనీయాంశంగా మారింది. కళ్లముందే రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేసుకున్నా పోలీస్, జీవీఎంసీ అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పూర్ణామార్కెట్‌లో సుమారు 640 దుకాణాలు ఉన్నాయి. ఇంకా బయట హోల్‌సేల్ షాపులు ఉంటాయి. వస్తువుల కొనుగోలు కోసం నగరం నలుమూలల నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రతిరోజూ వేల సంఖ్యలో వస్తుంటారు. వారి వాహనాల పార్కింగ్ కోసం మార్కెట్ మెయిన్‌రోడ్డులో ఒకవైపు కేటాయించారు. మార్కెట్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనాల కోసం మిగిలిన రోడ్డును కేటాయించారు. ఇదిలావుండగా మార్కెట్‌లోని దుకాణాల నుంచి రోజువారీ ఆశీలుతోపాటు వాహనాల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు కోసం జీవీఎంసీ జోన్-4 రెవెన్యూ ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేసి కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి వరకూ ఆశీలు వసూలుకోసం కొన్నాళ్ల కిందట



పూర్ణామార్కెట్ వద్ద రోడ్డుపైనే మళ్లీ వ్యాపారాల నిర్వహణ

వేలం నిర్వహించగా ఒకరు సుమారు రూ.92 లక్షలకు పాడుకున్నారు. ఆ కాంట్రాక్టర్‌కు ఆశీలు వసూలు చేసేందుకు స్టాండింగ్ కమిటీ ఇంకా ఆమోదం ఇవ్వాల్సి ఉంది. స్టాండింగ్ కమిటీ సమావేశం జరగకపోవడంతో ఆ అంశం ఇంకా ఆమోదం పొందకపోవడంతో జోన్-4 రెవెన్యూ అధికారులే రోజువారీ ఆశీలు వసూలుచేయాలి. కానీ వేలం దక్కించుకున్న వ్యక్తి అధికార పార్టీ నేతల అనుచరుడినంటూ జీవీఎంసీ అధికారుల వద్ద హడావిడి చేసి నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్‌లో రోజువారీ ఆశీలు వసూలుచేయడం ప్రారంభించారు. ప్రతిరోజూ సుమారు రూ.45 వేలు ఆశీలు వసూలవుతుండగా భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు జీవీఎంసీ డిపార్టుమెంటల్ కలెక్షన్ పేరుతో సౌకర్యం కేంద్రంలో రూ.వెయ్యి మాత్రమే డిపాజిట్ చేస్తున్నారు. మిగిలిన డబ్బును జీవీఎంసీ, పోలీస్ అధికారులతోపాటు కాంట్రాక్టర్ వాటాలుగా ... మిగతా 6వ పేజీలో

28న జీవీఎంసీ మేయర్ ఎన్నిక

- నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్ ఎన్నికను ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్టు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జీవీఎంసీ మేయర్‌గా ఉన్న గొలగాని హరివెంకటకుమారి ఈనెల 19న పదవీచ్యుతులయ్యారు. ఈ నేపథ్యంలో కొత్త మేయర్‌ను ఎన్నుకునేందుకు ఈనెల 28న కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నోటిఫికేషన్ విడుదల చేశారు. మేయర్ ఎన్నిక నోటిఫికేషన్‌తోపాటు తేదీ, సమయం, ఎన్నికల ప్రక్రియకు సంబంధించినఫారం-11 ప్రకారం సమాచారాన్ని కౌన్సిల్ సభ్యులతోపాటు ఎక్స్‌-అఫిషియో సభ్యులందరికీ ఈనెల 24లోపు అందజేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించించారు. 28న ఉదయం 11గంటలకు మేయర్ ఎన్నిక నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.ఇదిలావుండగా తాజా మాజీ మేయర్ హరివెంకటకుమారికి కార్యాలయం కేటాయింపును రద్దు చేస్తూ రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

గాడి తప్పిన నీటి సరఫరా విభాగం

కాంట్రాక్టర్ల చేతిలో కీలుబొమ్మలుగా అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో అంతర్భాగమైన నీటి సరఫరా, యూజీడీ అధికారులు కొంతమంది కాంట్రాక్టర్ల చేతిలో కీలుబొమ్మలుగా మారారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్లలో కాంట్రాక్టర్లు కోరినట్టు నిబంధనలు పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నగరంలో నీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్వహణ కోసం ఇంజనీరింగ్ డిపార్టుమెంటులో ప్రత్యేకంగా ఒక విభాగం ఉంది. నీటి సరఫరా పైప్‌లైన్‌లు, పంప్‌హౌస్‌లతోపాటు యూజీడీ పైప్‌లైన్లు, పంప్‌హౌస్‌ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూసేందుకు సూపరింటెండెంటెంట్ ఇంజనీర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ప్రతి జోన్‌కు ఒక అసిస్టెంట్ ఇంజనీర్ ఉంటారు. ఎక్కడైనా పైప్‌లైన్‌లు మార్చాల్సి వస్తే వాటికి సంబంధించిన అంచనాలు తయారుచేసి, ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి టెండర్లు పిలవడం, కాంట్రాక్టర్లతో పనులు చేయించడం, పూర్తయిన పనులకు బిల్లులు అయ్యేలా చర్యలు తీసుకోవడం చేస్తుంటారు. అయితే ఈ విభాగం కొంతకాలంగా గాడితప్పింది. కొంతమంది అధికారులను కాంట్రాక్టర్లు తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. వారి ద్వారా తమకు అనుకూలంగా విధానాలను తయారుచేయించుకుంటూ భారీగా లబ్ధి పొందుతున్నారు. యూజీడీ, నీటి ... మిగతా 6వ పేజీలో



- వారు చెప్పినట్టే టెండర్లకు నిబంధనలు తయారీ
- అంచనాల తయారీలో కంప్యూటర్ ఆపరేటర్ల ఇష్టారాజ్యం
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు
- మామూళ్లు అందడమే కారణమని ఆరోపణలు

పింఛను మొత్తం పెంచేలా చర్యలు తీసుకోవాలి

» ఎంపీ శ్రీభరత్‌కు చిట్టివలస జూట్ మిల్లు పింఛనుదారుల వినతి



విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న చిట్టివలస జూట్‌మిల్లు పింఛనుదారులు

తగరపువలస, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కార్మికులుగా పని చేసి రిటైరైన వారి కనీస పింఛను రూ.వెయ్యి నుంచి రూ.9 వేలుకు పెంచేలా చర్యలు తీసుకోవాలని చిట్టివలస కార్మిక పింఛనుదారుల సంఘం నాయకులు మంగళవారం విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రాని సమర్పించారు రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, ఇతరులకు రూ.4 వేలు చొప్పున సామాజిక పింఛన్లను అందిస్తోందని, కార్మికులు పని చేసిన రిటైరైన తమకు మాత్రం కేవలం రూ.వెయ్యి పింఛను అందుతుండడం అన్యాయమన్నారు. రూ.వెయ్యి పింఛనుతో బతికేదెలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వివిధ కంపెనీల్లో పని చేసిన తమ వంటి పింఛనుదారులు 37 లక్షల మంది ఉన్నారని, పింఛను పెంపునకు కృషి చేస్తే అంతమంది కార్మికులకు మేలు చేసిన వారవుతారన్నారు. సీనియర్‌సిటిజన్లకు బస్సులు, రైళ్లల్లో రాయితీలను అమలు చేయాలని కోరారు. ఈ అంశాలను పార్లమెంటులో ప్రస్తావించాలని కోరారు. ఈ విషయాన్ని కేంద్ర కార్మిక మంత్రి దృష్టికి తీసుకు వెళతానని ఎంపీ హామీ ఇచ్చారని కార్మిక పింఛనుదారుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఎంపీ శ్రీభరత్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రాంబాబు, బి.బాలాజీ, ఉపాధ్యక్షులు అప్పారావు, సహాయ కార్యదర్శి ఎం.అప్పలరాజు, కోశాధికారి పి.సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఫిల్మ్ క్లబ్‌లో రాజకీయాలు!

... 5వ పేజీ తరువాయి

ఆ రంగానికి చెందిన వారే పోటీ చేయాలని మరో వర్గం డిమాండ్ చేస్తోంది. గతంలో అలాగే క్లబ్ నడిచిందని, వైసీపీ హయాంలో రాజకీయం చేశారని, ఇప్పుడు అదే రాజకీయం కొనసాగించాలని చూస్తున్నారని, దీనిని తాము అంగీకరించబోమని అంటున్నారు. ముందు సంస్థ బైలా కూడా మార్చాలని, వైసీపీ వారు తరతరాలు వారే శాశ్వత సభ్యులుగా ఉండేలా బైలా నిబంధనలు మార్చారని, అవన్నీ తొలగించాలని, అందులో చిత్రసీమ వారే పోటీ చేయాలనే నిబంధన పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. నగరంలో అనేక క్లబ్‌లు ఉన్నాయని, ఎక్కడా రాజకీయ నేతలు నాయకత్వం వహించడం లేదని, కేవలం సభ్యులుగానే ఉంటున్నారని, ఇక్కడ ఎందుకు అలా చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

ఇదిలావుండగా క్లబ్‌లో 990 మందికి పైగా సభ్యులు ఉండగా, ఇటీవల వివాదాలు రేగుతున్న నేపథ్యంలో 15 మంది క్లబ్ నుంచి తప్పుకున్నట్టు తెలిసింది. ఈ క్లబ్‌ను ఆధారంగా చేసుకొని కొందరు వ్యాపారాలు చేయాలని చూస్తున్నారని, అదే గొడవలకు దారి తీస్తున్నదని ఆరోపణలు ఉన్నాయి.

8వ వార్డులో రైతుబజార్ ఏర్పాటుకు స్థల పరిశీలన

» రుషికొండ కూడలిలో కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

ఎండాడ, సాగర్‌నగర్ ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డులో రైతు బజార్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసినట్టు భీమిలీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. వార్డులో రైతు బజార్ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని ఎంపిక చేయడం కోసం మంగళవారం మరోసారి ఎండాడ, సుభాశ్‌నగర్ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆయన పరిశీలించారు. ఎండాడ- రుషికొండ డబుల్ రోడ్డులో ఉన్న ఎంకే గోల్డ్ కోస్టు వెనుక భాగంగా ఉన్న స్థలంతో పాటు సుభాశ్‌నగర్ సామాజిక భవనం వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. రైతు బజార్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. రైతు బజార్ ఏర్పాటైతే వచ్చే కొనుగోలుదారుల కోసం రహదారి సౌకర్యం, పార్కింగ్ సదుపాయం వంటి విషయాల్లో రాజీ పడకుండా నిర్ణయాలు ఉండాలని అధికారులను సూచించారు. ఎంకే గోల్డ్ కోస్టు వెనుక ఉన్న స్థలంలో ఓపెన్ జిమ్ చిల్డ్రన్ ప్లే ఏరియా వంటి వసతులను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అలానే ఎండాడ రోడ్డులో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా అనధికార దుకాణదారులకు, అదే ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో వాణిజ్య సముదాయాన్ని నిర్మాణం చేపట్టి ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రుషికొండ కూడలిలో శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను తొలగించి ఆ ప్రాంత ప్రజల కోరిక మేరకు కల్యాణ మండపం నిర్మాణాన్ని చేపట్టాలని, అలాగే గొల్లల ఎండాడ పాఠశాల ఆవరణలో ఉన్న తుపాన్ రక్షిత భవనాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భీమిలీ ఆర్డీవో సంగీత్ మాధుర్, జడ్సీ కనకమహాలక్ష్మీ కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చెట్టుపల్లి గోపి, శాఖరీ శ్రీనివాస్, అక్కరబోయిన రాంబాబు, చెట్టిపల్లి సన్యాసిరావు, ఒమ్మి బాబూరావు, సారిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో ఆడారి 'పవర్'

» అంతర్జాతీయ స్థాయి పోటీ పవర్‌లిఫ్టింగ్ పోటీలో ప్రథమ బహుమతి



నరసింగరావును అభినందిస్తున్న ఎంపీ శ్రీభరత్

సాగర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో ఈ నెల 3 నుంచి 7 వరకు జరిగిన అంతర్జాతీయ బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గీతం యూనివర్సిటీకి చెందిన ఆడారి నరసింగరావు మాస్టర్స్ 60 సంవత్సరాల విభాగంలో రాణించి ప్రథమ బహుమతి సాధించారు. ఈ పోటీలను సంయుక్త భారత ఖేల్ ఫౌండేషన్ (ఎస్‌బీకేఎఫ్)ఆధ్వర్యంలో నేపాల్‌లోని పోఖరా నగరంలోని రంగశాల అంతర్జాతీయ క్రీడా మైదనంలో నిర్వహించారు. గతంలో బాడీబిల్డింగ్, పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకుఅనేక పోటీల్లో విజేతగా నిలిచిన ఆడారి నరసింగరావు బహుమతులు సాధించారు. జాతీయ స్థాయి ఖోఖో క్రీడల్లో ఐదు సార్లు రాష్ట్రప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించారు. క్రీడల పట్ల ఉన్న ఈ అంకిత భావమే ఆయనకు గీతం యూనివర్సిటీలో స్పోర్ట్స్‌కోటాలో ఉద్యోగావకాశాన్ని కల్పించింది. గీతం యూనివర్సిటీ చైర్మన్, విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ తనకు అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వంతోనే ఈ గెలుపు సాధ్యమైందని నరసింగరావు అన్నారు. తన క్రీడా ప్రయాణాన్ని ప్రోత్సహిస్తూ ఎప్పుడూ అండగా నిలిచారని పేర్కొన్నారు.

ఎంపీ అభినందన

అంతర్జాతీయ పోటీల్లో రాణించిన ఆడారి నరసింగరావునువిశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అభినందించారు. తనను కలసిన ఆడారితో మాట్లాడుతూ క్రీడా ప్రతిభకు తమ సంపూర్ణ మద్దతు ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆడారి విజయం యువతకు, చిన్నారులకు స్ఫూర్తిదాయకమని శ్రీభరత్ అన్నారు.

విద్యార్థి మృతికి సంతాపంగా మెడికోల కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

తగరపువలస, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సంగివలస ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాలలో మేడపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ప్రణీత్ దత్ మృతికి సంతాప సూచకంగా మంగళవారం రాత్రి మెడికోలు సంగివలసలో కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించారు. బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థికి ఆత్మశాంతి కలగాలని కోరుతూ ఈ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ కళాశాల ప్రాంగణంలో ఉన్న వీధుల్లో నిర్వహించారు. విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు

కలెక్టర్ కావాలన్న లక్ష్యంతోనే...

... 5వ పేజీ తరువాయి

వైపు వెళ్లాలన్నది నా కోరిక. చిన్నప్పటి నుంచి కలెక్టర్‌కు ఉండే గౌరవం, అధికారాలు గురించి పేపర్లలో చూసి తెలుసుకుంటూ ఇష్టాన్ని పెంచుకున్నాను. టీఎం శేషన్ వంటి అధికారులు నాకు రోల్ మోడల్. వారి మాదిరిగా పేరు తెచ్చుకోవాలని ఉండేది. అయితే, వైద్య వృత్తి పట్ల ఆసక్తి ఉండడంతో ముందుగా ఎంబీబీఎస్ పూర్తిచేయాలనుకున్నా. ఒకవేళ సివిల్స్ సాధించలేక పోయినా అత్యుత్తమ ఫీల్డ్‌లో ఉండేందుకు మెడిసిన్ దోహదం చేస్తుందని భావించాను. మెడిసిన్ పూర్తయిన వెంటనే సివిల్స్ శిక్షణ ప్రారంభించాను. ఆప్షనల్‌గా మెడికల్ సైన్స్‌ను ఎంచుకున్నాను.

కుంగిపోకుండా బలంగా ప్రయత్నించా..

2021 మార్చిలో సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించాను. తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ పూర్తిచేశాను. మెయిన్స్‌లో ఫెయిల్ అయ్యాను. 2023లో ప్రిలిమ్స్ ఫెయిల్ అయ్యాను. కొంత ఆందోళన చెందాను. సాధారణంగా పోటీ పరీక్షల్లో ఎవరైనా ఫెయిల్ అయితే కుంగిపోతుంటారు. నేను కూడా రెండుసార్లు సివిల్స్‌లో ఫెయిల్ అయ్యాను. అయితే కుటుంబసభ్యులు ప్రోత్సాహంతో మరింత బలంగా ప్రయత్నించాలని నిర్ణయించుకున్నా. ఎక్కడ తప్పులు చేశానో గుర్తించి...మళ్లీ మూడోసారి ప్రయత్నించాను. ఇప్పుడు 975 ర్యాంకు వచ్చింది. ఈ ర్యాంకుకు ఐఆర్ఎస్ గానీ, ఐఆర్ఎల్ఎస్ గానీ రావచ్చు. కానీ, మరోసారి ప్రయత్నిస్తాను. కలెక్టర్ కావడమే లక్ష్యం.

8-10 గంటలు ప్రిపరేషన్..

ప్రిపరేషన్ ప్రారంభించిన తొలి రోజుల్లో రోజుకు 14 గంటలపాటు చదివేదాన్ని. ఆ తరువాత ఎనిమిది నుంచి పదిగంటలపాటు చదివేదాన్ని. ప్రాక్టీస్ ఎక్కువగా చేశాను. మెయిన్స్ పూర్తయిన తరువాత ఆరు నెలల కిందట మెడికల్ ఆఫీసర్‌గా చేరాను. ప్రస్తుతం చినవాల్తేరులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తు న్నాను. ఉద్యోగం చేస్తుండగానే ఇంటర్వ్యూకు హాజరై విజయం సాధించాను. చాలా ఆనందంగా ఉంది. సివిల్స్‌గానీ, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఒకటే సలహా...ప్రణాళికతో పాటు అంకితభావంతో కృషిచేయడం అత్యంత కీలకం.

హౌసింగ్ ఖాళీ!

... 5వ పేజీ తరువాయి

నిర్మాణాల పురోగతి, నాణ్యతా పరిశీలించేందుకు అధికారులు లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల కొరత కారణంగా ఈ పరిస్థితి వచ్చిందని చెప్పాలి. దీనికితోడు ఉన్న కొద్దిమంది కూడా ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్‌లు/వీడియో కాన్ఫరెన్స్‌లకు హాజరుకావాలి. వారాంతపు ప్రగతి నివేదికలు తయారుచేసి అధికారులకు పంపాలి. ఈ ఏడాది చివరికల్లా మరికొంతమంది రెగ్యులర్ అధికారులు, సిబ్బంది పదవీ విరమణ చేయనున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు రాబోయే రోజుల్లో భారీగా ఇళ్ల మంజూరుచేసే అవకాశం ఉంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే...రానున్న రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పర్యవేక్షణ ఎలా అనేది ప్రభుత్వం ఆలోచన చేయాలని వారంతా కోరుతున్నారు.

రోడ్లపై మళ్లీ దుకాణాలు

... 5వ పేజీ తరువాయి

పంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్డుపై దుకాణాలు పెట్టించినట్టయితే భారీగా ఆశీలు వసూలవుతుందని జీవీఎంసీ, పోలీస్ అధికారుల వద్ద కాంట్రాక్టర్ అభిప్రాయం వ్యక్తంచేయగా...దక్షిణ నియోజకవర్గానికి చెందిన నేతలతో తమకు ఒక ఫోన్ చేయిస్తే అందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కూటమి నేతలతో అధికారులకు ఫోన్ చేయించి రోడ్డుపై దుకాణాల ఏర్పాటుకు గల అడ్డంకులను తొలగించుకున్నారు. ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటికి స్పందించిన సీపీ శంఖబ్రతబాగ్చి ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ కిందిస్థాయి పోలీస్ అధికారులు స్పందించకపోవడంతో ఆయనే స్వయంగా పూర్ణామార్కెట్‌ను సందర్శించారు. రోడ్డుపై దుకాణాలు ఏర్పాటుచేయడం చూసి ఆగ్రహం వ్యక్తంచేశారు. మెయిన్‌రోడ్డుతో పాటు చుట్టుపక్కల రోడ్లపై ఆక్రమణలను తొలగించాల్సిందిగా ఆదేశించారు. దీంతో ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులు తొలగడంతోపాటు కొనుగోలుదారులు, వ్యాపారులంతా ఆనందం వ్యక్తంచేశారు. ఇది

ఇదిలావుండగా మంగళవారం సాయంత్రం తిరిగి మార్కెట్ మెయిన్‌రోడ్డులో దుకాణాలను తిరిగి ఏర్పాటు చేయడం మొదలెట్టారు. స్వయంగా పోలీస్ కమిషనర్ దగ్గరుండి ఆక్రమణలను తొలగింపజేస్తే తిరిగి ఏర్పాటవ్వడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై దుకాణాలు ఉండాల్సిందేనని, లేనిపక్షంలో తాను మామూళ్లు ఇవ్వలేనని పోలీస్, జీవీఎంసీ అధికారులకు కాంట్రాక్టర్ చెప్పినట్టు వ్యాపార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అందుకే రోడ్డును ఆక్రమించి దుకాణాలు పెట్టుకున్నా వారు పట్టించుకోకుండా వదిలేసి, పరోక్షంగా సహకరించారని ఆరోపిస్తున్నారు. ఈ విషయం సీపీ శంఖబ్రతబాగ్చి వద్ద ప్రస్తావించగా, రోడ్డుపై దుకాణాలను అనుమతించే ప్రసక్తే లేదని, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గాడితప్పిన నీటి సరఫరా విభాగం

... 5వ పేజీ తరువాయి

సరఫరా విభాగాల్లో ఏటా నిర్వహణ పనులు జరుగుతుంటాయి. వాటికోసం అధికారులు అంచనాలను తయారుచేసి టెండర్లు పిలుస్తుంటారు. అయితే టెండర్‌కు సంబంధించి ప్రతిపాదనలు తయారుచేసే సమయంలోనే అస్మదీయుడైన కాంట్రాక్టర్‌కు దక్కేలా నిబంధనలు పెడుతున్నారు. దీనివల్ల మిగిలిన కాంట్రాక్టర్లు టెండర్ వేయడానికి అవకాశం లేకుండా పోతోంది. తాజాగా నీటి సరఫరా విభాగంలో వార్షిక నిర్వహణ (యాన్యువల్ మెయింటెనెన్స్) కింద రూ.20 కోట్ల విలువైన పనులను చేయాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. వాటికి టెండర్లు పిలిచేందుకు వీలుగా ప్రతిపాదనలు తయారు చేసిన అధికారులు, ఒక్కో కాంట్రాక్టర్ మూడు పనులకు మాత్రమే టెండర్ వేయాలనే నిబంధనను చేర్చారు. అలాగే జోన్-6లో నీటి సరఫరా గ్యాప్‌లు కలపడం (మూడు కిలోమీటర్లు) కోసం రూ.60 లక్షల విలువైన వర్క్‌ను మూడు నెలల్లో పూర్తిచేయాలని, దీనికోసం గతంలో ఆరు కిలోమీటర్లు ఎస్‌డీపీఈ పైపులైన్ వేసిన అనుభవం ఉండాలని కండీషన్ పెట్టారు. ఇలా చేయడం వల్ల ఆ పనిని ఇంజనీర్లు ఎవరికి ఇవ్వాలనుకుంటున్నారో వారికే దక్కడానికి అవకాశం ఏర్పడిందని మిగిలిన కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఉదాహరణలు నీటి సరఫరా, యూజీడీ విభాగాల్లో అనేకం ఉన్నాయంటున్నారు. తమకు కావాల్సిన వారికి టెండర్ దక్కేలా చేసేందుకు అధికారులు రకరకాల నిబంధనలు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు.

డీబీల్లో కంప్యూటర్ ఆపరేటర్ల హవా

నీటి సరఫరా, యూజీడీ ఇంజనీరింగ్ విభాగంలో మూడు డ్రాయింగ్ బ్రాంచ్(డీబీ)లు ఉన్నాయి. ఒక్కో డీబీకి ఒక్కో టెక్నికల్ పర్సన్ ఇన్‌చార్జిగా ఉంటారు. అయితే టెక్నికల్ పర్సన్‌లను ఏఈ, ఈఈ స్థాయి అధికారులు డమ్మీలుగా చేసి, డీబీలో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లతో వ్యవహారాలను చక్కబెట్టేస్తుంటారు. ఏదైనా ఒక పనిచేయాలని అధికారులు లేదంటే ప్రజా ప్రతినిధులు ప్రతిపాదన పంపిస్తే, ఏఈలు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి వివరాలను డీబీలకు అందజేస్తారు. డీబీల్లో ఉండే కంప్యూటర్ ఆపరేటర్లు ఆయా పనులకు ఏ మెటీరియల్ ఎంతవాడాలి?, ఎంతమంది పనివాళ్లు అవసరం అవుతారు, ఎలాంటి యంత్రాలను వాడాల్సి ఉంటుంది, మెటీరియల్ రవాణా ఖర్చులు ఎంత అవుతుంది? మెటీరియల్ ధర మార్కెట్‌లో ఎస్ఎస్ఆర్ ప్రకారం ఎంత ఉంది? వంటివన్నీ లెక్కించి పని పూర్తిచేయడానికి అయ్యే ఖర్చును అంచనా (ఎస్టిమేట్) వేస్తారు. దీనిని డీబీలు పైఅధికారులకు పంపించి పనులను మంజూరు చేయిస్తారు. ఇలాంటి సమయంలో డీబీల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న కొందరు అంచనాలను భారీగా పెంచేస్తూ ప్రతిపాదనలు పంపిస్తున్నారు. టెండర్ పిలిచినప్పుడు ఆ వివరాలను తమతో అవగాహన కలిగిన కాంట్రాక్టర్లకు చెప్పి భారీ లెస్‌కు బిడ్ వేసేలా సహకరిస్తున్నారు. అందువల్లే నీటి సరఫరా, యూజీడీ విభాగాలకు సంబంధించి టెండర్లు 45 శాతం వరకు లెస్‌లకు వెళుతుంటాయని చెబుతున్నారు. రూ.లక్ష విలువైన పనికి టెండర్ పిలిస్తే అందులో కాంట్రాక్టర్‌కు గరిష్ఠంగా 13 శాతం లాభం ఉండేలా ఎస్టిమేట్ తయారుచేస్తారు. 13 శాతం లాభంలో జీఎస్టీ, ఆదాయపన్ను, వృత్తిపన్ను వంటివి మినహాయిస్తే ఐదు శాతం మాత్రమే మిగులుతుంది.

అలాంటిది ఏకంగా 45 శాతం వరకు లెస్‌కు వెళితే అందులో పని ఎలా పూర్తిచేస్తారు?, పన్నులు ఎలా కడతారు? అనేదానికి వారి బిడ్‌లను ఆమోదిస్తున్న అధికారులే సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. నీటి సరఫరా, యూజీడీ విభాగం మొత్తం కొంత మంది కాంట్రాక్టర్ల గుప్పిట్లో ఉందని, ఉన్నతాధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టిసారించి ఆ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

కూలి బకాయిలు చెల్లించాలి

ఆనందపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి డిమాండ్ చేశారు. కుసులువాడ పంచాయతీ రేగానిగూడేం చెరువులో పని చేస్తున్న ఉపాధి కూలీలతో మంగళవారం సమావేశమయ్యారు. ఫిబ్రవరి నెల నుంచి వేతనాలు అందలేదని, ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పని చేసినప్పటికీ రూ.70 నుంచి రూ.100 లోపు మాత్రమే డబ్బులు అందుతున్నట్లు కూలీలు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో లోపాలు సరిచేసి కూలీలకు సరిపడా వేతనం వచ్చేలా ప్రభుత్వం చూడాలని మూర్తి సూచించారు. ఐద్వా నాయకురాలు కె.నాగరాణి పాల్గొన్నారు

యువతకు నైపుణ్యాభివృద్ధి ఎంతో కీలకం: ఎంపీ శ్రీభరత్



విద్యార్థులకు అందిస్తున్న ఆహారం రుచిచూస్తున్న విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్

సాగర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ రుషికొండ హిల్‌నెంబరు-3 ఐటీ సెజ్‌లో ఉన్న సీడ్-అప్ సెంటర్‌ను మంగళవారం సందర్శించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, సీడ్‌అప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న విద్యార్థులతో ఎంపీ శ్రీభరత్ ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా అనేక శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నాయన్నారు. విద్యార్థులు వీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రానికి సరఫరా అవుతున్న భోజనం రుచి చూసి, ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా విద్యార్థులు శిక్షణపై దృష్టిపెట్టి తమ నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. మంచి భవిష్యత్తు కోసం శ్రమించాలని కోరారు. సీడ్ అప్ జాయింట్ డైరెక్టర్ కల్యాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బెడిసికొట్టిన అక్రమ తరలింపు?



కళాశాల ఆవరణలో ఐరన్ బీమ్స్

భీమునిపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భీమిలి ప్రభుత్వ జూనియరు కళాశాలలో పురాతన ఐరన్ బీమ్స్ అక్రమంగా తరలించడానికి చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయని తెలిసింది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఆ కళాశాల ఆవరణలో వున్న పురాతన ఐరన్ బీమ్స్‌ను గుట్టుచప్పుడు కాకుండా వ్యాన్‌లో తరలించడానికి ప్రయత్నిస్తున్నారన్న సమాచారం బయటకు వచ్చింది. ఈ విషయం తెలిసి విలేకరులు అక్కడికి వెళ్లారు. అక్కడ తెలిసిన వివరాల ప్రకారం.. 1924లో కళాశాల నిర్మాణ సమయంలో ఐరన్ బీమ్స్ వినియోగించారు. అనంతరం పునర్నిర్మాణ సమయంలో ఈ బీమ్స్‌ను తొలగించి కట్ చేశారు. ఆ సమయంలో కూడా కొన్ని టన్నుల బరువైన ఈ బీమ్స్‌ను అక్రమంగా తరలిస్తున్నారని రభస జరిగింది. దాంతో వాటిని ఓ పక్కన పడేశారు. ఇపుడు ఆ బీమ్స్ కింద పాములు సంచరిస్తున్నాయంటూ కోత యంత్రం దగ్గరకు వ్యాన్‌లో పంపడానికి ప్రయత్నించామని ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలియజేశారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎలా తరలిస్తారని మీడియా ప్రశ్నించగా, ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాకనే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 16 ఐరన్ బీమ్స్ సుమారు రెండు టన్నుల బరువు ఉంటాయని, రూ.లక్షన్నర వరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

వృత్తి విద్యాకోర్సుల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థినులకు ధ్రువీకరణపత్రాలు అందిస్తున్న చంద్రశేఖరరావు

ఆనందపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వృత్తివిద్యా కోర్సుల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ డాక్టర్ జె.చంద్రశేఖరరావు అన్నారు. ఆనందపురం మండలం ఎల్‌వీపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఇంటర్ విద్యార్థినులు వేసవి ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఆహార శుద్ధి (ఫుడ్ ప్రోసెసింగ్)లో కేక్, కుకీ, పాస్ట్రీస్‌లలో పది రోజులు శిక్షణ పూర్తి చేసిన సందర్భంగా మంగళవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రశేఖరరావు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, వాటిని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.

వృత్తి విద్యా కోర్సుల్లో రాణిస్తే మంచి అవకాశాలు అందుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో కాలేషా బేగం, ప్రిన్సిపాల్ లావణ్య, వృత్తి శిక్షణకర్త బి.స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తరగతులకు హాజరయ్యేందుకు మెడికోల సమ్మతి

» ఎన్‌ఆర్‌ఐ వైద్య కళాశాల నుంచి వెలువడని ప్రకటన



ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల

తగరపువలస, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) సంగివలస ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల విద్యార్థి ప్రవీణ్ ఆత్మహత్య ఉదంతం కొత్త మలుపు తిరిగింది. ఇంజనీరింగ్ 4వ సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థి పరీక్షల సమయంలో ఓఎంఆర్ షీటు లాక్కుని ఇవ్వనందుకు నిరసనగా మేడపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈ కళాశాల విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. స్లిప్పు పట్టుకుని ఓఎంఆర్ షీటు లాక్కున్న వైస్ ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తప్పించడానికి యాజమాన్యం అంగీకరించింది. అంతేకాకుండా డీన్ డా.సుధాకర్ అందుబాటులో లేనందువల్ల అతనిపై కూడా చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీ మేరకు విద్యార్థులు మంగళవారం మధ్యాహ్నం ఆందోళన విరమించారు. విద్యార్థులతో జరిగిన సమావేశానికి మీడియాను అనుమతించలేదు. అడుగడుగునా తనిఖీ చేసి అందరూ విద్యార్థులే ఉన్నారని నిర్ధారణ చేసుకున్న తర్వాత యాజమాన్య ప్రతినిధులు చర్చలు జరిపారు. ఎవరూ ఫొటోలు, వీడియోలు తీయకుండా జాగ్రత్త పడ్డారు. అయితే కొంతమంది విద్యార్థులు తమ జేబులో సెల్‌ఫోన్‌లు పెట్టుకుని సంభాషణలను రికార్డు చేశారు. బుధవారం నుంచి తరగతులకు హాజరు కావడానికి విద్యార్థులు సమ్మతించినట్లు తెలిసింది. అయితే యాజమాన్యం మాత్రం ఈ సంఘటనపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం విశేషం.



ఉభయ దేవేరులతో వేంకటేశ్వరస్వామి

వైభవంగా శ్రీవారి కల్యాణం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీ శ్రీవారి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మాంగళసూత్రధారణ, తలంబ్రాలు, సప్తపదులు, గౌరీపూజ ఘట్టాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

25, 26 తేదీల్లో 'గీతం'లో విలువిద్య పోటీలు

సాగర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని గత ఏడాది నుంచి దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జనజాతీయ గౌరవ్‌వర్ష కార్యక్రమంలో భాగంగా జనజాతీయ ఖేల్ మహోత్సవం, ట్రైబల్ ఆర్చరీ మీట్‌ను నిర్వహించనున్నట్టు టీసీఆర్ అండ్ టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమందా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ సహకారంతో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీలు ఈనెల 25, 26వ తేదీల్లో గీతం యూనివర్సిటీ మైదానంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతం అండమాన్ నికోబార్ నుంచి జూనియర్ లెవెల్‌కు నలుగురు, సీనియర్ లెవెల్‌కు నలుగురు చొప్పున ఆదివాసీ ఆర్చరీ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఏపీలోని ఐటీడీఏల పరిధి నుంచి కూడా సీనియర్, జూనియర్ విభాగాల్లో గిరిజన క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

పాఠశాలలో ధరిత్రి దినోత్సవం

అగనంపూడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినమడక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కొండబాబు పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. జీవకోటి మనుగడకు భూమే ఆధారమన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి రామకోటి, స్థానిక నాయకులు ఎ.మంగరాజు, బి.సత్యనారాయణ, హనుమంతరావు, ఉపాధ్యాయులు సంతోశ్‌కుమార్, నాయుడు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

వేపగుంట ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట కృష్ణానగర్‌లో కొలువైన శ్రీ లక్ష్మీగణపతి స్వామి ఆలయం 14వ వార్షికోత్సవం బుధవారం నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు, 18 సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, నిర్వహిస్తామని చెప్పారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 10, వంకాయలు (తెలుపు) 15, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 22, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజీ 15, క్యారెట్ 28 దొండకాయలు 18, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, బద్దచిక్కుడు 54, నిమ్మకాయలు (కిలో) 125, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 20, క్యాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 32, బ్రకోలి 45, కూరపెండలం 26, నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220



మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న దుకాణాలు



రహదారి పక్కనే అమ్మకాలు సాగిస్తున్న చిరు వ్యాపారులు

నిరుపయోగం.. మార్కెట్ యార్డు సముదాయం

- 61 షాపుల్లో కేవలం ఆరు దుకాణాల్లోనే చేపల విక్రయం
- రహదారులపై యథేచ్ఛగా చిరు వ్యాపారుల కార్యకలాపాలు
- తరచూ ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి ఈ-సేవా కేంద్రం వద్ద లక్షలాది రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డు సముదాయం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. 86, 87 వార్డుల ప్రజల సౌకర్యార్థం 2014లో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు లక్షలాది రూపాయలతో 61 షాపులను ఇక్కడి సముదాయంలో నిర్మించారు. ఆ సమయంలోనే ఈ షాపులను 61 మంది స్థానిక చిల్లర వ్యాపారులకు, రైతులకు కేటాయించారు. దీంతో కొద్ది రోజులు మాత్రమే ఇక్కడకు రైతులు వచ్చి వ్యాపారాలను కొనసాగించారు. కాలక్రమేణ షాపులను ఖాళీ చేసి మళ్లీ రోడ్ల పక్కనే ఆశీలును చెల్లిస్తూ వ్యాపారాలు సాగిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్ యార్డు

- ఇటీవల 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా'లో రోడ్ల పక్కన వ్యాపారాలను తొలగించాలని కోరిన స్థానికులు
- ఇప్పటికీ స్పందించని అధికారులు

సముదాయంలో కేవలం ఆరు షాపుల్లో మాత్రమే చేపలను విక్రయిస్తున్నారు. మిగతా షాపులన్నీ ఖాళీగా ఉన్నాయి. రహదారుల పక్కన స్థలాలను పలువురు ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేసి నెలకు రూ.ఐదు వేల నుంచి పదిహేను వేల రూపాయల వరకు అద్దెకు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నరన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్ల పక్కన వ్యాపార కలాపాలను సాగిస్తుండడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల పక్కన దుకాణాలను తొలగించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం శూన్యమని వాపోతున్నారు. ఈ క్రమంలో ఇటీవల 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' పేరిట నిర్వహించిన కార్యక్రమంలోనూ వడ్లపూడిలో రోడ్లపై ఆక్రమణలను తొలగించాలని, మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న షాపులను వారికి కేటాయించాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయినా ఇప్పటివరకు వారు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.

డ్రోన్ చూస్తోంది.. జర జాగ్రత్త!

- అత్యాధునిక సాంకేతికత ఉపయోగించి నిఘా పెంచిన పోలీసులు
- బహిరంగంగా మద్యపానం, ధూమపానం చేస్తున్న వారికి జరిమానా

పెందుర్తి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీసులు అనుసరిస్తున్న డ్రోన్ల నిఘా మంచి ఫలితాన్నిస్తోంది. పోలీసులు శివారు ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా ఉంచి ఆకతాయుల పని పడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యంపానం, ధూమపానం చేస్తున్నవారిని పోలీసులు పట్టుకుని రూ.50 వేల వరకు జరిమానా విధిస్తున్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 9వార్డులు, 15 పంచాయితీలు ఉన్నాయి. సుమారు 2లక్షల మంది జనాభా ఉన్నారు. స్టేషన్ నుంచి 15 నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో పలు గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో నేరాలు నియంత్రించేదుకు పోలీసులు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులు శివారు ప్రాంతాలు, బహిరంగం ప్రదేశాలు ముందుగానే గుర్తించి ఆ ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా ఏర్పాటుచేస్తున్నారు. నిఘాతో పేకాట, గంజాయి విక్రయాలు ,మాదకద్రవ్యాల వినియోగం, పందెంరాయుళ్ల, వంటి అసాంఘిక కార్యక్రమాలకు చెక్ పెడుతున్నారు. తప్పుచేస్తూ డ్రోన్లకు చిక్కితే కేసులేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వేపగుంట, పద్మనాభనగర్, నరవ, చీమలాపల్లి, సుజాతనగర్, చినముషిడివాడ, పెందుర్తి,



డ్రోన్‌ను ఎగురవేస్తున్న పోలీసులు

చింతగట్ల, జెర్రిపోతులపాలెంలో వంటి ప్రాంతాల్లో డ్రోన్‌ల నిఘా పెడుతున్నారు. డ్రోన్ల సాయంతో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడం మరింత సులువు అయిందని పోలీసులు అంటున్నారు. నేర నియంత్రణలో డ్రోన్లు సరికొత్త ఆయుధాల్లా పనిచేస్తున్నాయని అంటున్నారు. సుజాతనగర్ శివారులో ఇంటి ముందు ఆడుకుంటూ అదృశ్యమైన ఓ చిన్నారి కాపాడడానికి, చెరువు మట్టిలో కూరుకుపోయిన చిన్నారి ప్రాణాలు కాపాడడానికి డ్రోన్ సాంకేతిరకత వినియోగించామని పోలీసులు అన్నారు. దీంతో పెందుర్తిలో డ్రోన్ చూస్తోంది జర జాగ్రత్త.. దాని కంట కనబడకుండా లగెత్తండిరోయ్.. అంటూ కొందరు సరదాగా కామెంట్స్ చేస్తున్నారు.

పోలీసులకు వరం డ్రోన్లు



-సీఐ కెవీ సతీశ్‌కుమార్, పెందుర్తి

మాచేతిలో డ్రోన్ ఓ కొత్త ఆయుధం కనిపిస్తోంది. కమిషనర్ . శంఖబ్రతబాగ్చి ఆదేశాలుతో పెందుర్తి ప్రాంతంలో డ్రోన్లతో నిఘా పెట్టాము. అది మంచి ఫలితాలిస్తోంది. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, ధూమపానం చేసేవారిని పట్టుకుని వారిపై కేసులు నమోదు చేశాం. చిన్నారి అదృశ్యమైన సంఘటనలో డ్రోన్‌ను ఉపయోగించి కాపాడాం. నేరాలు నియంత్రణలో డ్రోన్ల సేవలను మరింత విస్తృతం చేస్తాం.

ఘనంగా బొర్రమాంబ మారువారం పండగ



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

అగనంపూడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత బొర్రమాంబ మారువారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపుకుంకుమలు, పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, స్థానిక నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, కె.సత్యారావు, ఎం.నరసింగరావు, గల్లా రాజు, కనకరాజు, ఎం.శ్రీను, మామిడి నాయుడు, జి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు

వేపగుంట ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా శ్రవణా నక్షత్రం పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారుజామున 4.30 గంటలకు పంచామృతంతో అభిషేకం, స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం సన్నిధిలో నిర్వహించిన సంతర్పణలో దాదాపు 500 మంది భక్తులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి నాయుడుతోట రవినగర్ చెందిన వెంకటరమణమూర్తి కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. వీరికి ఆలయ అర్చకుడు స్వామి వారి జ్ఞపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న కప్పస్తంభ వార్షిక ఆదాయం రూ.88 లక్షలు



సింహాచలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలోని కప్పస్తంభం ఆలింగనాల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.88 లక్షల ఆదాయం సమకూరింది. కొన్ని వందల ఏళ్ల క్రితం ప్రత్యేక యాగం చేసి సంతాన గోపాల యంత్రం ప్రతిష్ఠించటం ద్వారా అప్పన్న ఆలయంలోని బేడా మండపంలో ప్రత్యేక స్థంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ కప్పస్తంభం ఆలింగనం వల్ల కోరిన కోర్కెలు తీరుతాయని, ప్రధానంగా సుదీర్ఘకాలంగా సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ప్రస్తుత కప్పస్థంభాన్ని రూ.25 లు కప్పం చెల్లించి ఆలింగనం చేసుకుంటారు. అటువంటి ఆలింగనాల ద్వారా ఈ ఏడాదిలో మొత్తం రూ.88,10,050లు ఆదాయం లభించింది. ఇందులో అత్యధికంగా 2024 మేనెలలో రూ.8,61,425లు సమకూరగా, అత్యల్పంగా 2024 సెప్టెంబరులో రూ.4,90,000లు ఆదాయం సమకూరినట్టు దేవస్థానం రికార్డుల ప్రకారం వెల్లడవుతోంది.

మెట్టమాంబ ఉత్సవాలు ప్రారంభం

పెందుర్తిరూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం చింతలఅగ్రహారం, గవరపాలెం, దుర్గానగర్ గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం మెట్టమాంబ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూలవిరాట్ త్రిమాత ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ముందుగా భూలోకమాతకు పసుపుకుంకుమలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారి తోలేళ్ల ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 29న అమ్మవారి అనుపోత్సవాన్ని జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.

1,531వ రోజుకు చేరిన ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం,ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటును ప్రవేటీకరిస్తే ప్రతిఘటన తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణలు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,531వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పోరాటాలతోనే కేంద్రం దిగి వస్తుందన్నారు.

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చేలా చూడాలని ఎంపీకి వినతి



శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేసిన ప్రతినిధులు

ఆటోనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శిష్టకరణాలను ఓబీసీలో చేర్చేలా పార్లమెంటులో ప్రస్తావించాలని కోరుతూ నగరంలో ఎంపీ శ్రీభరత్‌కు గాజువాక శిష్టకరణ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. శిష్టకరణాలు విద్య, వైద్య, ఆర్థిక, సామాజిక రంగాలలో వెనకబడి ఉన్నందున వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో శిష్టకరణ సంఘ ప్రతినిధులు బి.సత్యారావు, బెహరా రాధాకుమారి, ప్రతాపరావు శ్రీనివాసరావు, ఎం.తిలక్ పట్నాయిక్, వరప్రసాద్, తదితరులు ఉన్నారు.

తాగునీటి ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నీరే ప్రాణాధారమని, అందువల్ల ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతను తవ్వించాలని కోరుతూ మంగళవారం 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా కాలనీలో భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగభూషణం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, పార్వతి, స్వాతి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేవీ అధికారులతో కార్పొరేటర్ వాగ్వాదం

మల్కాపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సింధియా నుంచి మల్కాపురానికి వెళ్లే దారిలో ఐఎన్ఎస్ కల్యాణి ఆసుపత్రి దగ్గర నేవీ అధికారులు రోడ్డుకు సగభాగానికి బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆ మార్గంలో పోతున్న 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు నేవీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. జీవీఎంసీ రోడ్డుమీద బారికేడ్లను పెట్టడానికి మీరెవరంటూ నేవీ అధికారులను కార్పొరేటర్ ప్రశ్నించగా వారు అంతంగా పట్టించుకోలేదు. దీంతో సదరు కార్పొరేటర్ ఈ విషయం జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జోన్-5 కమిషనర్ రాము దృష్టికి తీసుకు వెళతానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. బారికేడ్స్ కారణంగా రోడ్డు ఇరుకుగా మారుతోందని, ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న హెచ్‌ఎం శివాజీ, విద్యార్థులు, తదితరులు

అగనంపూడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, అందువల్ల ప్రతిఒక్కరూ తమ పిల్లలను వాటిలో చేర్పించాలని పినమడక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివాజీ కోరారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ మంగళవారం ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు అవగాహన ర్యాలీ నిర్వహించడంతో పాటు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ జీఎంతో సమావేశమైన కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

కాంట్రాక్టు కార్మికులను తొలగించవద్దు

స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్‌ఆర్)ను కోరిన నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించరాదని ఉక్కు అధికారులను అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు కోరారు. ప్లాంటులో జీఎం (హెచ్‌ఆర్) మధుసూధన్‌తో పాటు ఇతర అధికారులతో మంగళవారం కార్మిక నాయ కులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గతంలో 1,503మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, ఇప్పుడు తాజాగా మరో 170 మందిని తొలగిస్తున్నట్టు జాబితా విడుదల చేయడం సమంజసం కాదన్నారు. గతంలో ఆర్ఎల్‌సీ వద్ద జరిగిన సమావేశ నిర్ణయాల మేరకు కట్టుబడి ఉండాలని, మే 20 వరకు కార్మికులను తొలగించరాదని పేర్కొన్నారు. కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ఇటీవల తొలగించిన కార్మికుల్లో ప్రతిభ ఉన్న వారిని మళ్లీ విధుల్లోకి తీసుకుంటామన్నారు. సమావేశంలో నాయకులు మంత్రి రవి, నీరుకొండ రామచంద్రరావు, వంశీకృష్ణ, నమ్మి రమణ, వి.తాతారావు, అప్పారావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో 28న ధర్నా

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న ధర్నా నిర్వహించనున్నట్టు సీఐటీయూ నాయకులు తెలిపారు. ప్రతినెలా జీతం చెల్లించాలని, హెచ్‌ఆర్‌ఏను పునరుద్ధరించాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిలిపివేయాలని, ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆ రోజు అడ్మిన్ భవనం వద్ద ధర్నా చేస్తున్నామన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కు అందజేస్తున్న ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. నియోజవర్గానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆయన అందజేశారు. 15 మందికి గాను రూ.17,82,150ను చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పప్పు శంకరరావు, పంచదార్ల ఉగ్రం, దేముడు, తదితరులు పాల్గొన్నారు.

నరవ గ్రామంలో పోలీస్ సబ్ కంట్రోల్ సిద్ధం



ప్రారంభానికి సిద్ధమైన పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్

గోపాలపట్నం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు నరవ గ్రామంలో ఇటీవల నిర్మించిన పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ ఎట్టకేలకు ప్రారంభానికి సిద్ధమైంది. నరవ గ్రామంతో పాటు పరిసర గ్రామాలైన కోటనరవ, సత్తివానిపాలెం, గవర జగ్గయ్యపాలెం, జెర్రిపోతులపాలెం, ఇప్పిలివానిపాలెం, నందవానిపాలెం, చింతగట్ల తదితర గ్రామాలకు పోలీస్ స్టేషన్ 18 కిలోమీటర్లు దూరంలో ఉంది. దీంతో సుమారు లక్షన్నర జనాభా నివసిస్తున్న ఈ గ్రామాల్లో పోలీసు నిఘా తక్కువ అవడంతో నేరాలు పెరిగిపోతున్నాయి. ఈ గ్రామాలకు ప్రధాన కూడలైన నరవ గ్రామంలో పోలీస్ సబ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేశారు. నిత్యం ఇద్దరు పోలీసులు అందుబాటులో ఉంటారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూతబడిన బీఎస్ఎన్ఎల్ కార్యాలయం



మల్కాపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న భారత్ సంచార్ నిగామ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కార్యాలయం పూర్తిగా మూతపడింది. ఈ ప్రాంతంలో ఎన్నో కీలకమైన సంస్థలు, తూర్పునౌకదళం ప్రధాన కార్యాలయం ఇక్కడే ఉండడంతో నేవీ అధికారుల విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం 1990లో బీఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయంలో పని చేసే ఉద్యోగులకు క్వార్టర్స్ కూడా నిర్మించారు. కాలక్రమేణ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తగ్గిపోవడంతో దాదాపు 15 ఏళ్ల క్రితం ఈ కార్యాలయాన్ని పూర్తిగా మూసేశారు. దీంతో ఇక్కడి ఉద్యోగులు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఆ తరువాత బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లడంతో ఈ కార్యాలయంలోనే సిబ్బంది పని చేయడానికి ఓ ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. ప్రతినెల ఫోన్‌బిల్లులు కట్టించుకోవడం, కొత్త సిమ్ కార్డులు ఇవ్వడం అలాగే సిమ్‌కు ఆధార్ నెంబరు లింక్ చేయడం వంటి సేవలు చేస్తూ వచ్చారు. ఇప్పుడు ఉన్నట్టు ఉండి పదిహేన్ను రోజులుగా ఈ కార్యాలయాన్ని మూసేశారు. ప్రతిరోజు వివిధ సేవలు పొందడానికి వచ్చిన వారు నిరాశతో వెనుతిరిగి వెళ్తున్నారు. ఈ కార్యాలయం ఏర్పాటు చేయక ముందు మిందిలో ఉన్న బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయానికి వినియోగదారులు వెళ్లేవారు. ఇప్పుడు ఎట్‌వర్కుకు సంబంధించి అవసరాలుంటే వినియోగదారులు మిందికి వెళుతున్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు మరోసారి అలోచించి మల్కాపురం ప్రాంతంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నారీ శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

అక్కిరెడ్డిపాలెం , ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చదువుతో పాటు సమాజంలో ఎదురయ్యే పలు సమస్యలపై అవగాహన కలిగివుండాలని గాజువాక ఎస్ఐ అన్నారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు నారి శక్తి యాప్‌పై పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన నారీ శక్తి యాప్ వినియోగంపై అందరూ అవగాహన కల్పించుకోవడంతో పాటు ఇతరులకు కూడా వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమారస్వామి, గాజువాక ఏఎస్ఐ వినయ్, ఉపాధ్యాయులు మహ్మద్ ఇస్మాయిల్, రవిచంద్, తదితరులు పాల్గొన్నారు.

రెండు గంటలు ఆలస్యంగా వారణాసి ఎక్స్‌ప్రెస్

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాల దృష్ట్యా విశాఖ నుంచి వారణాసి వెళ్లే 18523 నంబరు గల రైలు రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేశారు. దీంతో బుధవారం ఉదయం 4.30 గంటలకు విశాఖలో బయలుదేరాల్సిన 18523 నంబరు గల రైలు 6.30 గంటలకు బయలుదేరనుంది.

డబుల్ లైను పరిశీలన

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస-కొరాపుట్ లైనులోని డార్లిపుట్-పాడువ మధ్య కొత్తగా నిర్మించిన 9.78 మీటర్ల డబుల్ లైను విద్యుదీకరణను సౌత్ ఈస్ట్రన్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ (సీఆర్ఎస్) బ్రిజేష్‌కుమార్ మిశ్రా మంగళవారం పరిశీలించారు. 25 టన్నుల యాక్సిల్ లోడ్‌కు అనుగుణంగా కొత్తగా వేసిన పట్టాలు, చిన్న వంతెనలను పరిశీలించారు. అనంతరం స్పీడ్ ట్రయిల్ నిర్వహించారు. ట్రయిల్ విజయవంతంగా పూర్తయిన తర్వాత ట్రాఫిక్ సౌకర్యాలకు సంబంధించి స్టేషన్ యార్డులో కొత్తగా వేసిన క్రాస్ వోవర్లు, హై లెవెల్ ప్లాట్‌ఫామ్, వంతెనలను పరిశీలించి సివిల్ ఇంజనీరింగ్, సిగ్నల్ అండ్ టెలికాం, ఎలక్ట్రికల్ శాఖల ప్లానింగ్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కంటి ఆసుపత్రి నుంచి వృద్ధురాలు అదృశ్యం

సీతంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రామాటాకీస్ రోడ్డులో గల ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రికి ఈ నెల 21న చికిత్స నిమిత్తం వచ్చిన వృద్ధురాలు అక్కడి నుంచి అదృశ్యమైంది. దీంతో ఆమె బంధువులు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొమ్మాది డ్రైవర్స్ కాలనీకి చెందిన పులగం కృష్ణ వద్ద తన సోదరి పల్లంటి దేవి (54) ఉంటోంది. ఈ నెల 21న కంటి వైద్యం నిమిత్తం ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యం కోసం ఆసుపత్రిలో ఉన్న ఆమె సాయంత్రం కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో తన సోదరి అదృశ్యంపై ఆమె సోదరుడు పులగం కృష్ణ ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆమెకు మతిస్థిమితం సరిగాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. సీఐ రమణ కేసు నమోదు చేశారు.



అదృశ్యమైన వృద్ధురాలు దేవి

పోలీసు స్టేషన్లకు ఆధునిక సాంకేతికత

మహారాణిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ సాంకేతికతలో భాగంగా పలు పోలీసు స్టేషన్లకు కంప్యూటర్లు, ప్రింటర్లు స్కానర్లు అందజేశారు. నగర పోలీసు విభాగాన్ని ఆధునికీకరించాలని భావించి కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వివిధ స్టేషన్లకు 25 కంప్యూటర్లు, 12 ప్రింటర్లు, 5 స్కానర్లు, 10 యూపీయస్‌లను అందించారు.

'ముస్లిం శ్మశానవాటికకు స్థలాన్ని అప్పగించాలి'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మక్కా మసీద్ శ్మశానవాటిక పూర్తిగా సమాధులతో నిండిపోయిందని, కొత్త సమాధులు పూడ్చేందుకు స్థలం లేదని ఈ నేపథ్యంలో శ్మశానవాటిక చుట్టూ ఉన్న కబ్జాదారులను వేరే చోటుకు తరలించి తమకు మేలు చేయాలని మక్కా మసీద్ ప్రెసిడెంట్ ఎస్కే. మున్నీర్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మరో నాలుగు మసీద్‌ల పరిధిలో ఉన్న ముస్లిం ఎవరైనా చనిపోతే ఇక్కడకే తీసుకొని వస్తున్నారన్నారు. కేజీహెచ్‌లో ముస్లింల మరణాలు జరిగితే తమ శ్మశాన వాటిక దగ్గరగా ఉండడంతో ఇక్కడే పూడ్చుతున్నారన్నారు. శవాలు పూడ్చేందుకు స్థలం లేనందున తమ విజ్ఞప్తిని పరిశీలించాలని కోరారు.

పన్ను రాయితీలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి



సమీక్షలో మాట్లాడుతున్న డీసీఆర్ ఎన్.శ్రీనివాస్, జడ్సీ మల్లయ్యనాయుడు

అల్లిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇంటిపన్ను, ఖాళీ స్థలాలపై విధించే పన్నుపై 5 శాతం రాయితీ, వడ్డీలో 50 శాతం తగ్గింపు అవకాశాన్ని వినియోగించుకునేందుకు ఏప్రిల్ 30 వరకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ విషయాన్ని జోన్‌ల పరిధిలో ఉన్న ప్రజలందరికీ తెలియజేయాలని మంగళవారం జోన్-4 కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ కార్యదర్శులకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఎన్.శ్రీనివాస్ సూచించారు. ప్రతీ ఇంటికి వెళ్లి పన్నులు చెల్లించడం ద్వారా కలిగే ప్రయోజనాలు, బకాయిల చెల్లింపు ద్వారా సమకూరే ఆదాయంతో నగర అభివృద్ధికి వెచ్చించే అవసరాన్ని వివరించాలని అన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఆర్ఓలు సన్యాసి పడల్, అప్పలరాజు, ఆర్ఐలు వీరబాబు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మురళీనగర్‌లో చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులతో పర్యావరణ ఇంజనీర్ పి.వి.ముకుందరావు తదితరులు

మురళీనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పుడమి రక్షణకు అందరూ కట్టుబడి ఉండాలని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ పర్యావరణ ఇంజనీర్ పి.వి.ముకుందరావు అన్నారు. విద్యార్థి దశ నుంచే పరిసరాల రక్షణ, పర్యావరణంపై మక్కువ చూపాలని పిలుపునిచ్చారు. అందరూ కలసికట్టుగా ధరిత్రి రక్షణకు బాధ్యత నిర్వర్తించాలన్నారు. మంగళవారం ధరిత్రి దినోత్సవం సందర్భంగా మురళీనగర్‌లో బాలలకు చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. రెండు రోజుల క్రితం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ కేటగిరీలుగా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఏయూ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఇ.ఉదయ భాస్కర రెడ్డి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీల్లో పాల్గొన్న సుమారు 200 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో..

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలోని వృక్షశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధరిత్రీ దినోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల కళాశాలలో మొక్కలు నాటి జిమ్నోస్పర్మ్ గార్డెన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొంటూ మొక్కల పెంపకంతో ఆరోగ్యకర వాతావరణ నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.ఎం.ఎ.నివేదిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జె.లావణ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమి వనరులను రక్షించండి

జ్ఞానాపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, గ్రీన్ గ్లోబ్ నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ .కె.మాణిక్యకుమారి విద్యార్థులతో కలసి భవిష్యత్ తరాలకు భూమి వనరులను ఎలా రక్షించుకోవాలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను నివారించడం, మొక్కలు నాటడం, పర్యావరణ అనుకూల జీవన శైలి, స్థిరమైన పర్యావరణ పద్ధతులు పాటించడం వంటి అంశాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ఎంట్రీలకు బహుమతులు అందజేశారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థినులతో ప్రోగ్రాం అధికారిణి

సామాజిక భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న తారకరామనగర్‌లో రూ.38 లక్షల వ్యయంతో రెండు అంతస్తుల సామాజిక భవనానికి ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, జనసేన ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, నాయకులు పైలా ముత్యాలనాయుడు, హనోక్, భరణికాన రాజు, వాసుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈపై ఎమ్మెల్యే ఆగ్రహం

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్థల విస్తీర్ణం, బడ్జెట్ ఎంత అని జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈఈ ఉమామహేశ్వరరావును వివరాలు అడిగారు. ఈ ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. అంతేకాకుండా ఎమ్మెల్యే సమక్షంలో స్థలాన్ని కొలిచారు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇప్పుడు కొలవడమేమిటన్నారు. మీరు ఇంజనీరింగ్ ఎక్కడ చేశారని ఏఈఈని ప్రశ్నించారు.

విశ్వగురు స్థానంలో మనదేశం



ఎమ్మెల్సీ సోము వీర్రాజును సత్కరిస్తున్న ప్రముఖులు

మహారాణిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మనదేశం ప్రపంచాన్ని శాసిస్తూ విశ్వగురు స్థానంలో ఉందని శాసనమండలి సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. మంగళవారం హోటల్ దసపల్లాలో తనకు జరిగిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వందల ఏళ్ల వివిధ వర్గాల వారు మనదేశాన్ని పాలించినప్పటికీ మన దేశ మూలాలు భారతీయ తత్వం, మన ధర్మం, జీవన విధానం చెక్కుచెదరలేదని అన్నారు. గత పాలకులు మనదేశ తత్వానికి అనుగుణంగా పాలించలేదని అన్నారు. కొందరు మతం మారినా, వారి జీవన విధానాలు మారలేదని గుర్తుచేశారు. వాజ్‌పేయి పాలనలోనే స్వర్ణచతుర్భుజి ద్వారా దేశవ్యాప్తంగా రహదారులు విస్తరించారని గుర్తుచేశారు. నేడు రైల్వేలు విమానంతో పోటీపడుతున్నాయని పేర్కొన్నారు. కేంద్రం చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలను సోము వీర్రాజు వివరించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోలిశెట్టి సత్యనారాయణ, గుడివాడ అప్పన్న, సత్యారావు, మాస్టర్ పసుపులేటి ఉషాకిరణ్, కోరాడ రాజబాబు, ఆకుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'వైద్యులు సమయపాలన పాటించాలి'



కేజీహెచ్‌లో పరిశీలిస్తున్న వైద్యవిద్యాశాఖ అదనపు డైరెక్టర్ వెంకటేశ్వరరావు

మహారాణిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వైద్యులు సమయపాలన కచ్చితంగా పాటించాలని వైద్య విద్యాశాఖ అదనపు డైరెక్టర్ డి.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం ఆయన కేజీహెచ్‌ను సందర్శించారు. క్యాజువాలిటీ సహా త్వరలో ప్రారంభించనున్న కొత్త వార్డులను పరిశీలించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ కార్యాలయం, నర్సింగ్ సిబ్బందికి వేసే రోస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ఆసుపత్రిలోని వివిధ విభాగాధిపతులు, వైద్యాధికారులతో సమావేశమయ్యారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే దృక్పథంతో పలు మార్గదర్శకాలను సూచించారు. రోగుల సంరక్షణకు అవసరమైన పరికరాలను జెమ్ పోర్టల్ ద్వారా కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కేసులను మరింత పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో ఏఎంసీకి కాంస్య పతకం



ట్రోఫీతో ఏఎంసీ విద్యార్థులు, ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెడికల్, డెంటల్ కళాశాలల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర వైద్య కళాశాల కాంస్య పతకం సాధించింది. నెల్లూరులో జరిగిన ఈ టోర్నీలో కెప్టెన్ వి.జి.ఎస్. కార్తీక్, వైస్ కెప్టెన్ పి.ఠాగూర్ ప్రసాద్ సారథ్యంలోని ఆంధ్ర వైద్య కళాశాల క్రికెటర్లు అద్భుతంగా రాణించి రన్నరప్ ట్రోఫీ, కాంస్య పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి మంగళవారం తన కార్యాలయం వద్ద పతక సాధకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ స్పోర్ట్సు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్.పాత్రుడు క్రికెటర్లను అభినందించారు.

కార్పొరేటర్ ఇంటిపై దాడికి యత్నం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పదిహేడో వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య ఇంటిపై కొందరు మంగళవారం రాత్రి దాడికి యత్నించారు. కార్పొరేటర్ భర్త నాగరాజు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకుని, సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు పెదవాల్తేరులోని కార్పొరేటర్ ఇంటికి వెళ్లి తలుపులు బాదడంతో నాగరాజు తల్లి తలుపులు తీశారు. వారి చేతిలో కర్రలు ఉన్నట్లు గమనించిన ఆమె వెంటనే తలుపులు మూసి, గట్టిగా అరిచారు. బయట కొద్దిసేపు హడావిడి చేసిన దుండగులు చుట్టుపక్కల వారు అప్రమత్తం కావడంతో పరారయ్యారు. ఆ సమయంలో కార్పొరేటర్ లావణ్య, ఆమె భర్త పోలమాంబ అమ్మవారి మారువారం పండగలో ఉన్నట్లు సమాచారం. పోలీసులు విచారణ చేస్తున్నారు.

వృద్ధులకు సొంత భవనం అవసరం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వయో వృద్ధుల కోసం సొంత భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అవసరమని నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా కన్సరన్ ఛారిటబుల్ ట్రస్ట్, విశాఖ బాలోత్సవ్ కమిటీ సంయుక్తంగా మీట్-గ్రీట్-ట్రీట్ కార్యక్రమాన్ని మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలను తరచూ నిర్వహించడం వల్ల వయోవృద్ధులు ప్రశాంతంగా ఉండే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన కన్సరన్ ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పి.కె.జోష్ మాట్లాడుతూ ఎంజీటీ వయోవృద్ధులతో పాటు విభిన్న ప్రతిభావంతులకు అతిత్వరలో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. ఎంజీటీ సభ్యులందరూ సహకరిస్తే వృద్ధుల కోసం సొంత భవనాన్ని నిర్మించడం ద్వారా భావి వయోవృద్ధులకుఈ కేంద్రం ఆసరాగా నిలుస్తుందన్నారు. విశాఖ బాలోత్సవ్ కమిటీ చైర్‌పర్సన్ కోరెడ్ల రమాప్రభ, సహకన్వీనర్ ఎస్.వీరభద్రరావు, డాక్టర్ రమేష్, డాక్టర్ ఎం.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ఎంపీకి వార్డు కార్యదర్శుల వినతి

మహారాణిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ ఆధారంగా తమను జూనియర్ అసిస్టెంట్లుగా తీసుకోవాలని వార్డు పరిపాలనా కార్యదర్శుల సంఘం ప్రతినిధులు మంగళవారం ఎంపీ ఎం.శ్రీభరత్‌ను కలిసి విన్నవించుకున్నారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేష్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శి ఉద్యోగులుగా జాయిన్ అయినప్పటి నుంచి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్స్‌తో పాటు ప్రొబేషన్ కాలం అయిన రెండేళ్ల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చారని తెలిపారు. ఎంపీని కలిసినవారిలో సంఘం ప్రతినిధులు చింతకాయల బంగారురాజు, డి.శివనారాయణ, పి.అనీల్‌ప్రకాష్, సాయికృష్ణ, నానాజీ ఉన్నారు.

గాడితప్పిన నీటి సరఫరా విభాగం

... 5వ పేజీ తరువాయి

సరఫరా విభాగాల్లో ఏటా నిర్వహణ పనులు జరుగుతుంటాయి. వాటికోసం అధికారులు అంచనాలను తయారుచేసి టెండర్లు పిలుస్తుంటారు. అయితే టెండర్‌కు సంబంధించి ప్రతిపాదనలు తయారుచేసే సమయంలోనే అస్మదీయుడైన కాంట్రాక్టర్‌కు దక్కేలా నిబంధనలు పెడుతున్నారు. దీనివల్ల మిగిలిన కాంట్రాక్టర్లు టెండర్ వేయడానికి అవకాశం లేకుండా పోతోంది. తాజాగా నీటి సరఫరా విభాగంలో వార్షిక నిర్వహణ (యాన్యువల్ మెయింటెనెన్స్) కింద రూ.20 కోట్ల విలువైన పనులను చేయాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. వాటికి టెండర్లు పిలిచేందుకు వీలుగా ప్రతిపాదనలు తయారుచేసిన అధికారులు, ఒక్కో కాంట్రాక్టర్ మూడు పనులకు మాత్రమే టెండర్ వేయాలనే నిబంధనను చేర్చారు. అలాగే జోన్-6లో నీటి సరఫరా గ్యాప్‌లు కలపడం (మూడు కిలోమీటర్లు) కోసం రూ.60 లక్షల విలువైన వర్క్‌ను మూడు నెలల్లో పూర్తిచేయాలని, దీనికోసం గతంలో ఆరు కిలోమీటర్లు ఎండీపీఈ పైప్‌లైన్ వేసిన అనుభవం ఉండాలని కండీషన్ పెట్టారు. ఇలా చేయడం వల్ల ఆ పనిని ఇంజనీర్లు ఎవరికి ఇవ్వాలనుకుంటున్నారో వారికే దక్కడానికి అవకాశం ఏర్పడిందని మిగిలిన కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఉదాహరణలు నీటి సరఫరా, యూజీడీ విభాగాల్లో అనేకం ఉన్నాయంటున్నారు. తమకు కావాల్సిన వారికి టెండర్ దక్కేలా అధికారులు రకరకాల నిబంధనలు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు.

డీబీల్లో కంప్యూటర్ ఆపరేటర్ల హవా

నీటి సరఫరా, యూజీడీ ఇంజనీరింగ్ విభాగంలో మూడు డ్రాయింగ్ బ్రాంచ్(డీబీ)లు ఉన్నాయి. ఒక్కో డీబీకి ఒక్కో టెక్నికల్ పర్సన్ ఇన్‌చార్జిగా ఉంటారు. అయితే టెక్నికల్ పర్సన్‌లను ఏఈ, ఈఈ స్థాయి అధికారులు డమ్మీలుగా చేసి, డీబీలో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లతో వ్యవహారాలను చక్కబెట్టేస్తుంటారు. ఏదైనా ఒక పనిచేయాలని అధికారులు లేదంటే ప్రజా ప్రతినిధులు ప్రతిపాదన పంపిస్తే, ఏఈలు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి వివరాలను డీబీలకు అందజేస్తారు. డీబీల్లో ఉండే కంప్యూటర్ ఆపరేటర్లు ఆయా పనులకు ఏ మెటీరియల్ ఎంతవాడాలి?, ఎంతమంది పనివాళ్లు అవసరం అవుతారు, ఎలాంటి యంత్రాలను వాడాల్సి ఉంటుంది, మెటీరియల్ రవాణా ఖర్చులు ఎంత అవుతుంది? మెటీరియల్ ధర మార్కెట్‌లో ఎస్ఎస్ఆర్ ప్రకారం ఎంత ఉంది? వంటివన్నీ లెక్కించి పని పూర్తిచేయడానికి అయ్యే ఖర్చును అంచనా (ఎస్టిమేట్) వేస్తారు. దీనిని డీబీలు పైఅధికారులకు పంపించి పనులను మంజూరుచేయిస్తారు. ఇలాంటి సమయంలో డీబీల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న కొందరు అంచనాలను భారీగా పెంచేస్తూ ప్రతిపాదనలు పంపిస్తున్నారు. టెండర్ పిలిచినప్పుడు ఆ వివరాలను తమతో అవగాహన కలిగిన కాంట్రాక్టర్లకు చెప్పి భారీ లెస్‌కు బిడ్ వేసేలా సహకరిస్తున్నారు. అందువల్లే నీటి సరఫరా, యూజీడీ విభాగాలకు సంబంధించి టెండర్లు 45 శాతం వరకు లెస్‌లకు వెళుతుంటాయని చెబుతున్నారు. రూ.లక్ష విలువైన పనికి టెండర్ పిలిస్తే అందులో కాంట్రాక్టర్‌కు గరిష్ఠంగా 13 శాతం లాభం ఉండేలా ఎస్టిమేట్ తయారుచేస్తారు. 13 శాతం లాభంలో జీఎస్టీ, ఆదాయపన్ను, వృత్తిపన్ను వంటివి మినహాయిస్తే ఐదు శాతం మాత్రమే మిగులుతుంది. అలాంటిది ఏకంగా 45 శాతం వరకు లెస్‌కు వెళితే అందులో పని ఎలా పూర్తిచేస్తారు?, పన్నులు ఎలా కడతారు? అనేదానికి వారి బిడ్‌లను ఆమోదిస్తున్న అధికారులే సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. నీటి సరఫరా, యూజీడీ విభాగం మొత్తం కొంతమంది కాంట్రాక్టర్ల గుప్పిట్లో ఉందని, ఉన్నతాధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టి సారించి ఆ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

కలెక్టర్ కావాలన్న లక్ష్యంతోనే...

... 5వ పేజీ తరువాయి

వైపు వెళ్లాలన్నది నా కోరిక. చిన్నప్పటి నుంచి కలెక్టర్‌కు ఉండే గౌరవం, అధికారాలు గురించి పేపర్లలో చూసి తెలుసుకుంటూ ఇష్టాన్ని పెంచుకున్నాను. టీఎం శేషన్ వంటి అధికారులు నాకు రోల్ మోడల్. వారి మాదిరిగా పేరు తెచ్చుకోవాలని ఉండేది. అయితే, వైద్య వృత్తిపై ఆసక్తితో ముందుగా ఎంబీబీఎస్ పూర్తిచేయాలనుకున్నా. ఒకవేళ సివిల్స్ సాధించలేకపోయినా అత్యుత్తమ ఫీల్డ్‌లో ఉండేందుకు మెడిసిన్ దోహదం చేస్తుందని భావించాను. మెడిసిన్ పూర్తయిన వెంటనే సివిల్స్ శిక్షణ ప్రారంభించాను. ఆప్షనల్‌గా మెడికల్ సైన్స్‌ను ఎంచుకున్నాను.

కుంగిపోకుండా బలంగా ప్రయత్నించా..

2021 మార్చిలో సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించాను. తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ పూర్తిచేశాను. మెయిన్స్‌లో ఫెయిల్ అయ్యాను. 2023లో ప్రిలిమ్స్ ఫెయిల్ అయ్యాను. కొంత ఆందోళన చెందాను. సాధారణంగా పోటీ పరీక్షల్లో ఎవరైనా ఫెయిల్ అయితే కుంగిపోతుంటారు. నేను కూడా రెండుసార్లు సివిల్స్‌లో ఫెయిల్ అయ్యాను. అయితే కుటుంబ సభ్యులు ప్రోత్సాహంతో మరింత బలంగా ప్రయత్నించాలని నిర్ణయించుకున్నా. ఎక్కడ తప్పులు చేశానో గుర్తించి... మళ్లీ మూడోసారి ప్రయత్నించాను. ఇప్పుడు 975 ర్యాంకు వచ్చింది. దీనికి ఐఆర్ఎస్ గానీ, ఐఆర్ఎల్ఎస్ గానీ రావచ్చు. కానీ, మరోసారి ప్రయత్నిస్తాను. కలెక్టర్ కావడమే లక్ష్యం.

8-10 గంటలు ప్రిపరేషన్..

ప్రిపరేషన్ ప్రారంభించిన తొలి రోజుల్లో రోజుకు 14 గంటలపాటు చదివేదాన్ని. ఆ తరువాత ఎనిమిది నుంచి పది గంటలపాటు చదివేదాన్ని. ప్రాక్టీస్ ఎక్కువగా చేశాను. మెయిన్స్ పూర్తయిన తరువాత ఆరు నెలల కిందట మెడికల్ ఆఫీసర్‌గా చేరాను. ప్రస్తుతం చినవాల్తేరులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్నాను. ఉద్యోగం చేస్తుండగానే ఇంటర్వ్యూకు హాజరై విజయం సాధించాను. చాలా ఆనందంగా ఉంది. సివిల్స్‌గానీ, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఒకటే సలహా...ప్రణాళికతోపాటు అంకితభావంతో కృషిచేయడం అత్యంత కీలకం.

హౌసింగ్ ఖాళీ!

... 5వ పేజీ తరువాయి

నిర్మాణాల పురోగతి, నాణ్యతా పరిశీలించేందుకు అధికారులు లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల కొరత కారణంగా ఈ పరిస్థితి వచ్చిందని చెప్పాలి. దీనికితోడు ఉన్న కొద్దిమంది కూడా ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్‌లు/వీడియో కాన్ఫరెన్స్‌లకు హాజరుకావాలి. వారాంతపు ప్రగతి నివేదికలు తయారుచేసి అధికారులకు పంపాలి. ఈ ఏడాది చివరికల్లా మరికొంత మంది రెగ్యులర్ అధికారులు, సిబ్బంది పదవీ విరమణ చేయనున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు రాబోయే రోజుల్లో భారీగా ఇళ్లు మంజూరుచేసే అవకాశం ఉంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే...రానున్న రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పర్యవేక్షణ ఎలా అనేది ప్రభుత్వం ఆలోచన చేయాలని వారంతా కోరుతున్నారు.

ఫిల్మ్ క్లబ్‌లో రాజకీయాలు!

... 5వ పేజీ తరువాయి

ఆ రంగానికి చెందిన వారే పోటీ చేయాలని మరో వర్గం డిమాండ్ చేస్తోంది. గతంలో అలాగే క్లబ్ నడిచిందని, వైసీపీ హయాంలో రాజకీయం చేశారని, ఇప్పుడు అదే రాజకీయం కొనసాగించాలని చూస్తున్నారని, దీనిని తాము అంగీకరించబోమని అంటున్నారు. ముందు సంస్థ బైలా కూడా మార్చాలని, వైసీపీ వారు తరతరాలు వారే శాశ్వత సభ్యులుగా ఉండేలా బైలా నిబంధనలు మార్చారని, అవన్నీ తొలగించాలని, అందులో చిత్రసీమ వారే పోటీ చేయాలనే నిబంధన పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. నగరంలో అనేక క్లబ్‌లు ఉన్నాయని, ఎక్కడా రాజకీయ నేతలు నాయకత్వం వహించడం లేదని, కేవలం సభ్యులుగానే ఉంటున్నారని, ఇక్కడ ఎందుకు అలా చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇదిలావుండగా క్లబ్‌లో 990 మందికి పైగా సభ్యులు ఉండగా, ఇటీవల వివాదాలు రేగుతున్న నేపథ్యంలో 15 మంది క్లబ్ నుంచి తప్పుకున్నట్టు తెలిసింది. ఈ క్లబ్‌ను ఆధారంగా చేసుకొని కొందరు వ్యాపారాలు చేయాలని చూస్తున్నారని, అదే గొడవలకు దారితీస్తున్నదని ఆరోపణలు ఉన్నాయి.

రోడ్లపై మళ్లీ దుకాణాలు

... 5వ పేజీ తరువాయి

పంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్డుపై దుకాణాలు పెట్టించినట్టయితే భారీగా ఆశీలు వసూలవుతుందని జీవీఎంసీ, పోలీస్ అధికారుల వద్ద కాంట్రాక్టర్ అభిప్రాయం వ్యక్తంచేయగా...దక్షిణ నియోజకవర్గానికి చెందిన నేతలతో తమకు ఒక ఫోన్ చేయిస్తే అందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కూటమి నేతలతో అధికారులకు ఫోన్ చేయించి రోడ్డుపై దుకాణాల ఏర్పాటుకు గల అడ్డంకులను తొలగించుకున్నారు. ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటికి స్పందించిన సీపీ శంఖబ్రత బాగ్చి ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ కిందిస్థాయి పోలీస్ అధికారులు స్పందించకపోవడంతో ఆయనే స్వయంగా పూర్ణామార్కెట్‌ను సందర్శించారు. రోడ్డుపై దుకాణాలు ఏర్పాటుచేయడం చూసి ఆగ్రహం వ్యక్తంచేశారు. మెయిన్‌రోడ్డుపైఆక్రమణలను తొలగించాల్సిందిగా ఆదేశించారు. దీంతో ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులు తొలగడంతోపాటు కొనుగోలుదారులు, వ్యాపారులంతా ఆనందం వ్యక్తంచేశారు. ఇదిలావుండగా మంగళవారం సాయంత్రం తిరిగి మార్కెట్ మెయిన్‌రోడ్డులో దుకాణాలను తిరిగి ఏర్పాటుచేయడం మొదలెట్టారు. స్వయంగా పోలీస్ కమిషనర్ దగ్గరుండి ఆక్రమణలను తొలగింపజేస్తే తిరిగి ఏర్పాటవ్వడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. రోడ్డుపై దుకాణాలు ఉండాల్సిందేనని, లేకుంటే తాను మామూళ్లు ఇవ్వలేనని పోలీస్, జీవీఎంసీ అధికారులకు కాంట్రాక్టర్ చెప్పినట్టు వ్యాపార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అందుకే రోడ్డును ఆక్రమించి దుకాణాలు పెట్టుకున్నా వారు పట్టించుకోకుండా వదిలేసి, పరోక్షంగా సహకరించారని ఆరోపిస్తున్నారు. ఈ విషయం సీపీ శంఖబ్రతబాగ్చి వద్ద ప్రస్తావించగా, రోడ్డుపై దుకాణాలను అనుమతించే ప్రసక్తే లేదని, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్వచ్ఛతకు దూరంగా శ్రీకృష్ణాపురం సచివాలయం

» చెత్తాచెదారాలతో నిండిన ప్రాంగణం
» అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు

ఆరిలోవ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డు శివారు ప్రాంతంలో గల గిరిజన గ్రామం శ్రీకృష్ణాపురం సచివాలయం అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సచివాలయం ప్రాంగణంలో చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా మారింది. ఇక్కడ ఎప్పుడూ చెత్త ఏరివేత, తరలింపు వంటి కార్యక్రమాలు చేపట్టకపోవడం, సచివాలయ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా ఈ సచివాలయాన్ని పేర్కొన వచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్, స్వర్ణాంధ్ర పేరుతో స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తున్న ఈ సచివాలయ పరిధిలో అలాంటివేవీ అమలు కాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, సిబ్బందే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తమ కార్యాలయాల చుట్టూ అపరిశుభ్రంగా నెలకొనేలా వ్యవహరిస్తుంటే, ఇక వీరు ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నట్టు అన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో ఉండే అధికారులు, సిబ్బంది స్వచ్ఛతకు సంబంధించిన


చెత్తాచెదారాతో నిండిన శ్రీకృష్ణాపురం సచివాలయ పరిసరాలు

అనేక కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు ముందుకు నడిపించాలి. కానీ, ఇక్కడి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని పలువురు అంటున్నారు.

కేవలం ఆదేశాలు ఇవ్వడం తప్ప మేం పాటించేది లేదు అన్న విధంగా వీరి వైఖరి ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

సచివాలయ ప్రాంగణంలో అంతా అపరిశుభ్రత నెలకొనడంతో అక్కడకు వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉందంటూ స్థానికులు అంటున్నారు.

ఇప్పటికైనా సచివాలయ సిబ్బంది, అధికారులు స్పందించి తమ చుట్టూ ఉన్న అపరిశుభ్రతను పారదోలే ప్రయత్నం చేస్తారో లేదో చూడాలి మరి.

నగదు చోరీపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఓ వేడుకకు వెళ్లినప్పుడు తన హ్యాండ్‌బ్యాగులో ఉన్న నగదు పోయిందంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. నక్కవానిపాలెంలో నివాసం ఉంటున్న ఎరుసు మణికుమారి ఈ నెల 9న సమీపంలోని డీఎస్సార్ ఫంక్షన్ హాలులో ఓ వేడుకకు వెళ్లారు. ఆ సమయంలో తన హ్యాండ్‌బ్యాగును ఓ పక్కన ఉంచిన కాసేపటికి తిరిగి తన బ్యాగు తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు. తన హ్యాండ్‌బ్యాగులో ఉన్న రూ.20 వేలు మాయం అయినట్టు ఆమె ఈ నెల 19న గుర్తించారు. ఫంక్షన్ హాలులోనే దొంగతనం జరిగి ఉంటుందనే ఉద్దేశంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.8 లక్షలు, 15 తులాల బంగారంతో వివాహిత అదృశ్యం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సుమారు 15 తులాల బంగారం, రూ.8 లక్షలతో వివాహిత అదృశ్యం అయినట్టు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ నూకరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్దిలపాలేనికి చెందిన బోదిరెడ్డి శ్రీలక్ష్మీదేవి (48) ఈ నెల 16న బయటకు పని మీద వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఆమె తనతో పాటు15 తులాల బంగారం, రూ.8 లక్షలు తీసుకువెళ్లినట్టు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : జాలారి ఎండాడ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఎలాపు కనకమ్మ (50) అదృశ్యం అయినట్టు ఆమె కుమారుడు వెంకట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ జి.సత్యం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లాసన్స్ బే కాలనీలోని ఓ హోటల్‌లో కనకమ్మ పని చేస్తోంది. ఈ నెల 20న సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటికి బయలుదేరింది.అయితే ఆమె ఇంటికి చేరలేదు. వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వైద్యులకు సమయ పాలన అవసరం'

మహారాణిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వైద్యులు సమయపాలన కచ్చితంగా పాటించాలని వైద్య విద్యాశాఖ అదనపు డైరెక్టర్ డి.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం ఆయన కేజీహెచ్‌ను సందర్శించారు. క్యాజువాలిటీ సహా త్వరలో ప్రారంభించనున్న కొత్త వార్డులను పరిశీలించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ కార్యాలయం, నర్సింగ్ సబ్బందికి వేసే రోస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ఆస్పత్రిలోని వివిధ విభాగాధిపతులు, వైద్యాధికారులతో సమావేశమయ్యారు.

సినిమా గైడ్

● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
● **జాక్ :** రమాదేవి
● **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 10, వంకాయలు (తెలుపు) 15, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 22, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 15, క్యారెట్ 28 దొండకాయలు 18, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 54, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 20, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ఘనంగా పోలమాంబ మారువారం పండుగ


పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెదవాల్తేరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పద్నాలుగా గ్రామాలకు ఆరాధ్య దైవమైన శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి మారువారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆలయ సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గాయత్రి ఉత్సవ కమిటీ సభ్యులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఇంటిపై దాడికి యత్నం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పదిహేడో వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య ఇంటిపై కొందరు మంగళవారం రాత్రి దాడికి యత్నించారు. కార్పొరేటరు భర్త నాగరాజు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకుని, సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు పెదవాల్తేరులోని కార్పొరేటర్ ఇంటికి వెళ్లి తలుపులు బాదడంతో నాగరాజు తల్లి తలుపులు తీశారు. వారి చేతిలో కర్రలు ఉన్నట్టు గమనించిన ఆమె వెంటనే తలుపులు మూసి, గట్టిగా అరిచారు. బయట కొద్దిసేపు హడావిడి చేసిన దుండగులు చుట్టుపక్కల వారు అప్రమత్తం కావడంతో పరారయ్యారు. ఆ సమయంలో కార్పొరేటర్ లావణ్య, ఆమె భర్త పోలమాంబ అమ్మవారి మారువారం పండుగలో ఉన్నట్టు సమాచారం. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఇళ్ల పట్టాలు కోరుతూ ఆర్కేపురంవాసుల ఆందోళన

ఆరిలోవ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో సుమారు 40 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న తమకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని కోరుతూ చినగదిలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఎం, ఆర్కే పురం అంబేడ్కర్ గ్రామ సంఘం ఆధ్వర్యంలో రామకృష్ణాపురం వాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ జీవో నెంబరు 296, 388, 30 ప్రకారం రామకృష్ణాపురం గ్రామంలో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఆ ప్రాంతంలో వీరు ఏళ్ల తరబడి నివాసం ఉంటున్నారన్నారు. అనంతరం మండల డెప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు ఈ కార్యక్రమంలో సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణారావు, రామకృష్ణాపురం గ్రామ అధ్యక్షుడు వంకర బాబూరావు, గౌరవాధ్యక్షుడు కాకార గోవింద్, సీఐటీయూ నాయకుడు ఆదినారాయణ, సీపీఎం కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, డబి అప్పలరాజు. ఐసీ నాయుడు, కె.కుమారి, కొండమ్మ, కమిటీ సభ్యులు ఎస్.శివగిరి, కె.వెంకటేశ్వరావు, చిన్న, ఎంగోపీ కృష్ణ రంజిత, ఎన వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


చినగదిలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న రామకృష్ణాపురం వాసులు

అధికారుల అనాలోచిత నిర్ణయాలతో అప్పన్న భక్తులకు అవస్థలు

» భక్తులకు నీడనిచ్చే చెట్ల కింద టీ కార్నర్ ఏర్పాటు



చెట్ల కింద ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన టీ కార్నర్

సింహాచలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అధికారుల అనాలోచిత నిర్ణయంతో పలువురు భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిలో భాగంగా సింహగిరిపై మాడవీధిలో భక్తులకు రుచికరమైన కాఫీ, టీలను విక్రయాలు జరపాలనే లక్ష్యంతో గత డిసెంబరులో బహిరంగ వేలం నిర్వహించగా హక్కు దక్కించుకున్న గుత్తేదారుడు సింహాద్రి కాఫీ కార్నర్ పేరుతో దుకాణాన్ని తెరిచారు. అందుకోసం దేవస్థానానికి నిబంధనల ప్రకారం సుమారు రూ.5 లక్షల వరకు సొమ్ము ముట్టింది. వేలం నిర్వహణలో దుకాణం ఏర్పాటుకు కొలతలు ప్రకటించలేదు. దాంతో వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. వేలంలో దక్కించుకున్న తరువాత కమిషనర్ ఆదేశాలతో సుమారు రూ.5 లక్షల పెట్టుబడితో కాఫీ కార్నర్‌ను తెరిచి నెల రోజులు గడవక ముందే దానిని అధికారులు మౌఖిక ఆదేశాలతో మూయించేశారు. ఇదిలావుండగా అటు గుత్తేదారునికి నష్టం మాట ఎలాగున్నా దుకాణం ఏర్పాటు చేసిన స్థలం నిత్యం వేలాదిమంది భక్తులు తిరుగాడుతుండేది కావడం, అక్కడ బాదం చెట్లు ఉండటంతో దాని నీడ భక్తులకు ఉపయోగపడకుండా పోయింది. ఇటువంటి పరిస్థితుల్లో దుకాణాన్ని మరొక ప్రాంతానికి తరలించి భక్తులకు నీడను కల్పించాలని కోరుతున్నారు.

ఆస్తి పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించండి

» జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లింపుదారులు తమ ఆస్తి పన్నును ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన నేపథ్యంలో విశాఖపట్నం లైన్స్ క్యాన్సర్ హాస్పిటల్ యాజమాన్యం ఈ అవకాశాన్ని వినియోగించుకొంది. తమ ఆస్తి పన్నును 5 శాతం రాయితీతో చెక్కును రూ.1,14,239ను అందించిందని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ వీరిని ఆదర్శంగా తీసుకుని మరికొన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, తమ ఆస్తి పన్నులను చెల్లించి 5 శాతం రాయితీ పొంది విశాఖ నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ జాగా పన్నులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం రాయితీ 2025 ఏప్రిల్ 30తో ముగుస్తుందని, అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరం సంబంధించి ఆస్తిపన్నుపై వడ్డీపై రాయితీని 50 శాతం 2025, ఏప్రిల్ 30 వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినందున ఆస్తి, ఖాళీ జాగా పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీసీ కోరారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ ఆస్తి పన్నును ఆన్‌లైన్ ద్వారా గాని, జీవీఎంసీ అన్ని సౌకర్యం కేంద్రాలు, సంబంధిత బ్యాంకులు, సచివాలయాల్లో క్రెడిట్, డెబిట్, యూపీఐ, నగదు, చెక్కుల ద్వారా చెల్లించుకునే వెసులుబాటుకల్పించినట్టు వెల్లడించారు.

పూర్వ విద్యార్థి సుహిత అనుపమ్‌పై 'గీతం' లఘు చిత్రం

» సివిల్ సర్వీసెస్‌పై ఆసక్తి, స్ఫూర్తి కలిగించేలా చిత్రీకరణ



సాగర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గీతం విశ్వవిద్యాలయంనుంచి ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసి ఐపీఎస్‌కు ఎంపికై బిహార్‌లో పోలీసు అధికారిగా విధులు నిర్వహిస్తూ భారత ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక గ్యాలంటరీ అవార్డును అందుకున్న కె.సుహిత అనుపమ్‌పై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లఘుచిత్రాన్ని రూపొందించింది. సివిల్ సర్వీసుల పట్ల విద్యార్థులలో ఆసక్తిని కలిగించేందుకు, స్ఫూర్తి నింపేందుకు ఈ లఘుచిత్రం రూపొందించినట్టు విశ్వవిద్యాలయం వర్గాలు వెల్లడించాయి. బిహార్‌లోని ఎందరో కిరాతక హంతకుల మెడలను వంచిన మహిళా ఐపీఎస్ అధికారిగా ప్రశంసలు అందుకున్న కె.సుహిత అనుపమ్ దేశంలో భారత ప్రభుత్వ గ్యాలంటరీ అవార్డు అందుకున్న మూడో మహిళగా గుర్తింపు పొందడం విశేషం. జాతీయ సివిల్ సర్వీసుల దినోత్సవం సందర్భంగా కె.సుహిత అనుపమ్ ఆన్‌లైన్‌లో ప్రసంగించారు. పదో తరగతి వరకు గుంటూరులో విద్యాభ్యాసం చేసిన తాను ఇంటర్ తరువాత గీతంలో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేశానని చెప్పారు. సివిల్ సర్వీసుల్లోకి ప్రవేశించాలనే తన కాంక్షను గీతం అధ్యాపకులు ఎంతో సహకరించారని తెలిపారు. సివిల్స్ మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకూ వెళ్లి విజయం సాధించడంలో తడబడినా, రెండో ప్రయత్నంలో విజయం సాధించినట్లు వెల్లడించారు. స్వయంగా రూపొందించుకున్న నోట్స్ తనకు ఎంతో ఉపయోగపడిందని, ముఖ్యంగా గీతంలో ఒక పక్క సివిల్ ఇంజనీరింగ్ చదువుతూ..గీతం గ్రంథాలయంలో లభించే పుస్తకాలు, పత్రికల ద్వారా విషయ పరిజ్ఞానం పెంచుకున్నట్టు తెలిపారు. మిగిలిన పరీక్షలతో పోల్చితే సివిల్ సర్వీసుల పరీక్షలు పారదర్శకంగా జరుగుతాయన్నారు. సమయపాలన, చుట్టూ ఉన్న సమాజంలో జరుగుతున్న విషయాలపై లోతైన అవగాహన, స్వయం విశ్లేషణ సివిల్స్‌లో ఎంతో ఉపయోగకరమన్నారు. తనకు చిన్నతనం నుంచి చరిత్ర, జాగ్రఫీ అంటే ఎంతో ఇష్టమని.. అలాగే ఎక్కువగా నేషనల్ జియోగ్రఫిక్ ఛానల్ తరచూ వీక్షిస్తానని తెలిపారు. సివిల్స్‌లో తనకు ఇవి ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. పోటీ పరీక్షల పుస్తకాలు చదవడం, నమూనా ఇంటర్వ్యూలకు హాజరు కావడం, ముందు నుంచి లక్ష్యంపై స్థిరమైన అభిప్రాయంతో ఉండటం ద్వారా సివిల్స్‌లో విజయం సాధించవచ్చని ఆమె పేర్కొన్నారు.

గెడ్డలో పేరుకుపోయిన పూడిక

» ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ స్థానికుల ఆరోపణ


మురుగు పారే అవకాశం లేకుండా పూడికతో నిండిన గెడ్డ

ఆరిలోవ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల ఎస్సీ కాలనీ, శ్రీకృష్ణాపురంలో గల ప్రధాన కాలవలో పేరుకుపోయిన పూడికను తొలగించకపోడంతో మురుగు నిలిచిపోయి అధ్వానంగా తయారైంది. పరిసరాల్లో దుర్వాసన వెలువడుతోంది. దోమలు వృద్ధి చెందిన ఇబ్బందిగా తయారైంది. దీనివల్ల ఏ రోగాలు ప్రబలుతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని చెప్పడానికి ఈ కాలువ ఉదాహరణగా చెప్పవచ్చని స్థానికులు అంటున్నారు.

గతంలో ఇక్కడ 30 అడుగుల గెడ్డ ఉండేది. క్రమేపీ ఆక్రమణలకు గురవడంతో ప్రస్తుతం గెడ్డ చాలా చిన్నదిగా అయిపోయింది. దీనికి తోడు పూడికలు తీయకపోవడంతో గెడ్డతో మురుగు ప్రవహించే అవకాశమే లేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు. ఈ విషయమై జీవీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడమే లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈ గెడ్డలో పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గెడ్డ పూడిక తీసేందుకు సహకరించండి

» వీఎంఆర్డీఏ ఛైర్మన్‌కు కార్పొరేటర్ మంగవేణి వినతి


వీఎమ్మార్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటరు మంగవేణిపోలారావు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఓ గెడ్డలో పూడిక తొలగించేందుకు వీలు లేనందున, సమీపంలోని కొంత ప్రాంతాన్ని కేటాయిస్తే, అక్కడ నుంచి ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయించడానికి వీలవుతుందని, ఇందుకోసం ఎంవీపీ కాలనీలోని వుడా నర్సరీలో కొంత స్థలం కేటాయించాలని వీఎమ్మార్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌కు కార్పొరేటరు గొలగాని మంగవేణిపోలారావు కోరారు. హనుమంతువాక మీదుగా ఎంవీపీ రెండు, ఆరు, ఏడు, ఎనిమిది సెక్టర్లలో నుంచి వాసవానిపాలెం వద్ద సముద్రంలో కలిసే గెడ్డ ప్రవాహానికి ఎంవీపీ కాలనీ ఏడో సెక్టరు వద్ద గెడ్డలో పూడిక పేరుకుపోతోంది. దీనివల్ల ఆ పక్కన ఉన్న స్కీమ్ ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి తీవ్ర దుర్గంధంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అక్కడకు ఎక్స్‌కవేటర్ వెళ్లి శుభ్రం చేయడానికి వీలులేని పరిస్థితి ఉంది. గెడ్డను ఆనుకుని వీఎమ్మార్డీఏ నర్సరీ ఉంది. నర్సరీలోకి ఎక్స్‌కవేటర్ ప్రవేశిస్తే, అక్కడి నుంచి గెడ్డను శుభ్రం చేసే అవకాశం ఉంటుంది.

కాబట్టి కొంత స్థలాన్ని కేటాయిసే ఎక్స్‌కవేటర్, లారీలు వెళ్లేందుకు వీలుగా ర్యాంప్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తే, ఎప్పటికప్పుడు గెడ్డ పూడిక తొలగించడానికి అవకాశం ఉంటుందని సమస్యను వివరించారు. కాబట్టి, ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని మంగవేణి కోరారు. సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ప్రణవ్ హామీ ఇచ్చారు.

25, 26 తేదీల్లో గిరిజన విలువిద్య పోటీలు

సాగర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకొని గత ఏడాది నుంచి దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జనజాతీయ గౌరవ్ వర్ష కార్యక్రమంలో భాగంగా జనజాతీయ ఖేల్ మహోత్సవం, ట్రైబల్ ఆర్చరీ మీట్‌ను నిర్వహించనున్నట్లు టీసీఆర్ అండ్ టీఎమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమందా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ సహకారంతో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీలు ఏప్రిల్ 25, 26వ తేదీల్లో గీతం యూనివర్సిటీ మైదానంలో రెండు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతం అండమాన్ నికోబార్ నుంచి జూనియర్ లెవెల్‌కు నలుగురు, సీనియర్ లెవెల్‌కు నలుగురు చొప్పున ఆదివాసీ ఆర్చరీ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అలాగే ఏపీలోని ఐటీడీఏల పరిధి నుంచి కూడా సీనియర్, జూనియర్ విభాగాల్లో గిరిజన క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. పోటీలు ప్రారంభోత్సవానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరు కానున్నట్టు తెలిపారు.

జీవో నం.3పై మంత్రి వ్యాఖ్యలు అర్థరహితం

» ఎమ్మెల్సీ కుంభా రవిబాబు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవిబాబు, జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర

మద్దిలపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జీవో నంబర్ 3పై గత వైసీపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసిందని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు స్పష్టం చేశారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీవో నంబర్ 3 పై రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ శాఖ మంత్రి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. జీవో నంబర్3 పై వైసీపీ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసినప్పటికీ, అలాంటి పిటిషన్ వేయలేదని మంత్రి సంధ్యారాణి చెబుతూ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో జీవో నంబర్ 3ని పునరిద్ధరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

రాష్ట్ర మంత్రి ఆ జీవో పునరిద్ధరించడం జరగదని, దానికి బదులు వేరే జీవో తీసుకొస్తామని చెబుతున్నారన్నారు. జీవో నంబర్ 3 సమస్య పరిష్కరించిన తర్వాతే డీఎస్సీ చేపట్టాలని, లేదంటే గిరిజన యువతకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాటం చేస్తుందని చెప్పారు. సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ జల్లపల్లి సుభద్ర పాల్గొన్నారు.

ముగిసిన నైపుణ్య శిక్షణ


ధ్రువపత్రాలు అందుకున్న శిక్షణ పొందిన విద్యార్థులు

ఆరిలోవ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సర్వ శిక్షా అభియాన్ ఆదేశాల మేరకు శ్రీకృష్ణాపురంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు గత 12 రోజులుగా అందిస్తున్న వృత్తి విద్యానైపుణ్యాభివృద్ధి సమగ్ర శిక్షణ మంగళవారంతో ముగిసింది. సమగ్ర శిక్షణాభివృద్ధి ఒకేషనల్ ఉపాధ్యాయురాలు ఎస్.దాక్షాయణి ఆధ్వర్యంలో 'అందం-ఆరోగ్యం' అనే అంశంపై శిక్షణ అందించారు. ఈ శిక్షణలో విద్యార్థులు.. ఒక వ్యక్తిని ఏ విధంగా అందంగా తీర్చి దిద్దాలి, అలాగే ఆరోగ్యం విషయంలో, చర్మ సౌందర్యం, జుట్టు గోళ్ల మొదలగు బాహ్య అందాలను ఏ విధంగా సంరక్షించుకోవాలో అనే విషయాలపై శిక్షణ అందించారు. ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖ జిల్లా గురుకుల విద్యాసంస్థల సమన్వయకర్త ప్రభావతమ్మ, జీసీడీవో డాక్టర్ ఖలీషా బేగం, జిల్లా వొకేషనల్ కో-ఆర్డినేటర్ రిషీకేశ్ తదతరులు పాల్గొన్నారు.

అప్పన్న కప్పస్తంభం వార్షిక ఆదాయం రూ.88 లక్షలు

సింహాచలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలోని కప్పస్తంభం ఆలింగనాల ద్వారా 2024-25ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.88 లక్షల ఆదాయం సమకూరింది. కొన్ని వందల ఏళ్ల క్రితం ప్రత్యేక యాగం చేసి సంతాన గోపాల యంత్రం ప్రతిష్ఠించటం ద్వారా అప్పన్న ఆలయంలోని బేడా మండపంలో ప్రత్యేక స్థంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ కప్పస్తంభం ఆలింగనం వల్ల కోరిన కోర్కెలు తీరుతాయని, ప్రధానంగా సుదీర్ఘకాలంగా సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ప్రస్తుత కప్పస్థంభాన్ని రూ.25 లు కప్పం చెల్లించి ఆలింగనం చేసుకుంటారు. అటువంటి ఆలింగనాల ద్వారా ఈ ఏడాదిలో మొత్తం రూ.88,10,050లు ఆదాయం లభించింది. ఇందు లో అత్యధికంగా 2024 మేనెలలో రూ.8,61,425లు సమకూరగా, అత్యల్పంగా 2024 సెప్టెంబరులో రూ.4,90,000 లు ఆదాయం సమకూరినట్టు దేవస్థానం రికార్డుల ప్రకారం వెల్లడవుతోంది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఒకరితో సరిపెట్టొద్దు...ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలను కనాలి
- పోషన్ పఖ్వాడా-2025 రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి


నగరంలోని వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన పోషన్ పఖ్వాడా-2025 కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి. చిత్రంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.సూర్యకుమారి, డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, యూనిసెఫ్ ప్రతినిధి రేషా ఎన్ దేశాయ్, తదితరులు ఉన్నారు

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిరిజన, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహార పంపిణీని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పోషన్ పఖ్వాడా-2025పై మంగళవారం ఉదయం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నగర పరిధిలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు అభిమతమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశలకు గ్రాట్యుటీ విషయంలో సీఎం సానుకూలంగా వ్యవహరించారన్నారు. అందుకే మహిళా పక్షపాతిగా చంద్రబాబునాయుడు గుర్తింపు పొందారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను అర్థం చేసుకుని క్షేత్రస్థాయి సిబ్బంది కష్టపడి పనిచేయాలన్నారు. ఐసీడీఎస్, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో సేవలను అందించాలన్నారు. పోషన్ పఖ్వాడా కార్యక్రమంలో మొదటి 1,000 రోజులు పిల్లల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పిల్లలు ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీవీ, ఫోన్ల వినియోగానికి పెద్దలు తాము దూరంగా ఉంటూ పిల్లలను కూడా దూరంగా ఉంచేలా చూడాలన్నారు. గిరిజన ప్రాంతాలతో పోలిస్తే మైదాన ప్రాంతాల్లో సిజేరియన్లు అధికంగా జరుగుతున్నాయని, ఈ పరిస్థితి మారాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. జనాభా వృద్ధి సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనాలన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇద్దరు లేదా ముగ్గురు, అంతకంటే ఎక్కువ అనే నినాదాన్ని ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎక్కువ మంది పిల్లలు ఉన్నా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు ఆగవని, సంక్షేమ పథకాలపై ప్రభావం ఉండబోదన్నారు. దీనికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. సమావేశంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ జపాన్‌లో మాదిరిగా ఇక్కడి పిల్లలకు కూడా ఆరోగ్యకరమైన అలవాట్లు చేయాలన్నారు. అక్కడ పిల్లలతో సైక్లింగ్, వ్యాయామం తప్పకుండా చేయిస్తారన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటుచేసిన ఫుడ్ స్టాళ్లను మంత్రి, అధికారులు పరిశీలించారు. అనంతరం సామూహిక సీమంతాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.సూర్యకుమారి, డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, యూనిసెఫ్ ప్రతినిధి రేషా ఎన్ దేశాయ్, ఐసీడీఎస్ జేడీ చిన్మయిదేవి, పీడీ జయదేవి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్టర్ల సమావేశం రసాభాస

రెండు వర్గాలుగా విడిపోయి ఒకరికొకరు కొట్టుకున్న వైనం

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజోతి): జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం సమావేశం రసాభసగా మారింది. రెండు వర్గాలుగా విడిపోయి ఒకరికొకరు కొట్టుకోవడంతో సమావేశం అర్ధంతరంగా ముగిసింది. కాంట్రాక్టర్లకు సంబంధించిన సమస్యలతోపాటు అసోసియేషన్ ఎన్నిక ప్రక్రియపై చర్చించుకునేందుకు సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆశీల్‌మెట్ట కూడలిలోని వేమన మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసుకున్నారు. సమావేశం ప్రారంభమయ్యాక కాంట్రాక్టర్లు రెండు వర్గాలుగా మారి ఒకరినొకరు విమర్శించుకోవడం ప్రారంభించారు. ఒక కాంట్రాక్టర్ దగ్గర గుమస్తాగా ప్రస్థానం ప్రారంభించి.. తర్వాత కాంట్రాక్టర్‌గా మారి ప్రస్తుతం ఇంజనీరింగ్ అధికారులను శాసిస్తున్న ఓ కాంట్రాక్టర్ వ్యవహార శైలిపై సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ నెల 30న జరిగే చందనోత్సవం కోసం పిలిచే టెండర్లలో కాంట్రాక్టర్లు ఎవరూ పాల్గొనొద్దని ఆదేశిస్తూ కాంట్రాక్టర్ల సంఘం వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు పెట్టిన విషయాన్ని కొందరు ప్రస్తావించారు. తమను టెండర్లు వేయొద్దని ఆదేశించడం ఏమిటని, ఇష్టం లేనివారు మానేయాలి గానీ ఇతరులకు అలా చేయవద్దని చెప్పడం భావ్యం కాదని అభ్యంతరం వ్యక్తంచేశారు. మరొకరు లేచి యూజీడీ, నీటిసరఫరా విభాగంలో పిలవబోయే టెండర్లను కూడా ఒక్కో కాంట్రాక్టర్‌కు మూడేసి వర్కులు పంచాలంటూ అధికారులను ఆదేశించారని, అధికారులు కూడా సదరు కాంట్రాక్టర్ చెప్పినట్టే ప్రతిపాదనలు తయారుచేశారని దుయ్యబట్టారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు లేచి కాంట్రాక్టర్లకు బిల్లులు చేయిస్తానంటూ, అధికారులకు ఇవ్వాలంటూ 4 శాతం కమీషన్లు వసూలు చేసి బిల్లులు మాత్రం చేయలేదన్నారు. దీంతో మరోవర్గం వారికి పాత కార్యవర్గంపై ఆరోపణలు చేయడంతో సమావేశం రసాభసాగా మారింది. పరిస్థితి చేజారిపోవడంతో ఒకరిపై ఒకరుదాడి చేసుకున్నారు. మిగిలిన కాంట్రాక్టర్లు వారినిచూసి అక్కడ నుంచి బయటకు పరుగులు తీశారు. .

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

- నిందితుల్లో ఇద్దరు మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించిన పోలీసులు



స్వాధీనం చేసుకున్న బైకులతో క్రైమ్ ఏడీసీపీ మోహనరావు, తదితరులు

పెందుర్తి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి ప్రాంతంలో ద్విచక్రవాహనాలు చోరీ చేసిన ముగ్గురిని క్రైమ్ ఎస్సై సూరిబాబు అరెస్టు చేశారు. మంగళవారం పెందుర్తి నేర విభాగ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైమ్ ఏడీసీపీ మోహనరావు వివరాలు వెల్లడించారు. కూర్మన్నపాలెం ఎన్టీఆర్ కాలనీకి చెందిన తోటాడ నితిన్‌కుమార్ (19), గాజువాక రాజీవ్‌నగర్‌కు 18 ఏళ్ల బాలుడికి ఒడిశా రాష్ట్రానికి చెందిన 17 ఏళ్ల మైనర్ రైలు ప్రయాణంలో పరిచయం అయ్యాడు. వీరు ముగ్గురూ జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం ద్విచక్ర వాహనాల చోరీల్లో ఆరితేరిన దొంగలుగా మారారు. పగలంతా రెక్కీ చేసి ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వానాలను చోరీ చేసేవారు. వీరి నుంచి రూ.11 లక్షల విలువ చేసే 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. .

తీగ లాగితే డొంక కదిలింది..

పెందుర్తికి చెందిన శరగడం సంతోశ్ తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీ జరిగిందంటూ ఈ నెల 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పాత నేరస్థులైన వీరి ముగ్గురి కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. చోరీ చేసిన బైకులకు తప్పుడు పత్రాలు సృష్టించి ఒడిశా రాష్ట్రంలో విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఈ క్రమంలో క్రైమ్ ఎస్ఐ డి.సూరిబాబు చోరీ చేసిన బైక్‌లను ఒడిశాలో విక్రయిస్తుండగా వీరి ముగ్గురిని పట్టుకున్నారు. పెందుర్తిలో 3, దువ్వాడలో 12, గుణపూర్‌లో 1 బైకును వీరు చోరీ చేసినట్టు పోలీసుల విచారణలో నిర్ధారించారు. 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నితిన్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు నిందితులను జువైనల్ హోమ్‌కు తరలించారు. వీరిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన క్రైమ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సూరిబాబు, ఏఎస్ఐ మూర్తి, హెచ్‌సీ నాగరాజు, పీసీలు కిశోర్, పైడిరాజు, దేవుడునాయుడు, నితీశ్‌కుమార్, హైమావతిలను ఏడీసీపీ అభినందించారు.

ఐకానికా సిటీ నిర్మాణానికి భూమి పూజ రేపు

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రుషికొండ ఐటీ పార్కులోని హిల్ నంబర్-3ని ఆనుకుని 97 ఎకరాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ 'ఐకానికా సిటీ' నిర్మాణానికి గురువారం ఉదయం భూమి పూజ జరగనున్నది. చినజీయరుస్వామి చేతులమీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఐకానికా ప్రతినిధులు తెలిపారు. భోగాపురంలో నిర్మాణం పూర్తి చేసుకుంటున్న గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం విశాఖపట్నం అభివృద్ధికి సూచిక అని, దీంతో పాటు సిటీ ఆఫ్ డెస్టినీ కూడా అభివృద్ధి చెందుతుందని ఐకానికా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష్ అభిప్రాయపడ్డారు. ప్రైవేటు పెట్టుబడులు విశాఖకు పెద్దఎత్తున రావడానికి భోగాపురం ఎయిర్‌పోర్టు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇందుకు ఐకానికా సిటీయే ఉదాహరణ అని పేర్కొన్నారు.

ఐటీ రంగంలో టాప్‌లో ఉన్న బెంగళూరులో గార్డెన్ సిటీ, హైదరాబాద్‌లో సైబర్ సిటీని నిర్మించిన తాము ఐటీ హబ్‌గా మారుతున్న విశాఖలో ఐకానికా సిటీని నిర్మిస్తున్నామని, ఇది కూడా వాటిలాగే ప్రెస్టేజియస్ ప్రాజెక్టుగా నిలవనున్నదన్నారు. విల్లాలు, అపార్ట్‌మెంట్లు, కన్వెన్షన్ సెంటర్‌తో పాటు ఫైవ్ స్టార్ హోటల్ కూడా నిర్మిస్తామని తెలిపారు.

ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం-2009 సెక్షన్ 12(1)సీ ప్రకారం ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఓసీ వర్గాల చిన్నారులు ఒకటో తరగతిలో ప్రవేశం పొందేందుకు సమగ్రశిక్షా రాష్ట్ర శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. విద్యార్థుల నివాసానికి సమీపంలో ఉన్న ఐటీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరతగతిలో 25 శాతం కోటా కింద ప్రవేశం పొందవచ్చని సమగ్రశిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్, గ్రామ సచివాలయం, మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాల విద్యాశాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1800-4258-599ను సంప్రదించాలని కోరారు.

సీజ్ చేసిన 320 వాహనాలు అప్పగింత

- కోర్టు ప్రత్యేక అనుమతితో యజమానులకు అందజేత
- సీపీ శంఖబ్రత బాగ్చి


వాహనదారునికి సంబంధిత పత్రాన్ని అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసులు వివిధ కేసులు, సందర్భాల్లో సీజ్ చేసిన 320 ద్విచక్రవాహనాలను సంబంధిత యజమానులకు అప్పగించారు. 'వాహన మేళా' పేరుతో పోలీస్ బ్యారెక్స్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సీపీ శంఖబ్రత బాగ్చి వాహనాలను వాటి యజమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వివిధ కేసులు, సందర్భాల్లో వాహనాలను పోలీసులు సీజ్ చేస్తుంటారని, వాటిని ఆయా పోలీస్ స్టేషన్ల ఆవరణలో, ప్రత్యేక యార్డుల్లోనూ భద్రపరుస్తామన్నారు. కేసులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోవడం వల్ల వాహనాలను రిలీజ్ చేసేందుకు అవకాశం ఉండదన్నారు. అప్పటివరకు వాహనాలు ఆరుబయటే ఉండిపోవడం వల్ల సంబంధిత యజమానులు నష్టపోయే పరిస్థితి ఎదురవుతోందన్నారు. అంతేకాక వాహనాలను భద్రపరచడం, చోరీకి గురికాకుండా కాపలా కాయడం, స్థలం కొరత వంటి కారణాలతో పోలీస్ శాఖకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అందువల్ల కేంద్ర హోం మంత్రిత్వశాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సీజ్ చేసిన వాహనాలను కోర్టు ప్రత్యేక అనుమతితో సంబంధిత యజమానులకు అందజేసే ప్రక్రియకు ముందుగా విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే శ్రీకారం చుట్టామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19న సీజ్ చేసిన 152 వాహనాలను వాటి యజమానులకు అందజేశామన్నారు. ఆ సమయంలో వారి ముఖాల్లో కనిపించిన ఆనందాన్ని స్ఫూర్తిగా తీసుకుని మంగళవారం మరో 320 వాహనాలను సదరు యజమానులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏడీసీపీ మోహనరావు, ఏసీపీలు లక్ష్మణరావు, వాసుదేవ్, సీఐలు హుస్సేన్, కోరాడ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టును సందర్శించిన నేపాల్ బృందం

విశాఖపట్నం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నేపాల్ ప్రభుత్వ వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ కార్యదర్శి డాక్టర్ గోవింద్‌ప్రసాద్ శర్మ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడి బృందం మంగళవారం విశాఖపట్నం పోర్టును సందర్శించింది. ఇందులో క్రిపి సమగ్రి కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సాల్ట్ ట్రేడింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ అసిస్టెంట్ సీఈవో ఉన్నారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దుబే నేపాల్ బృందానికి స్వాగతం పలికారు. పోర్టులో ఉన్న మౌలిక సదుపాయాలు, నిర్వహణా సామర్థ్యం, కీలక వసతులపై పోర్టు అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. గోబల్ టెండర్ల ద్వారా యూరియా, డీఏపీ వంటి ఎరువుల దిగుమతి అవకాశాలను అన్వేషించడమే తమ పర్యటన ముఖ్య ద్దేశమని నేపాల్ బృందం పేర్కొంది. విశాఖపట్నం పోర్టుకు వాణిజ్యపరంగా విస్తృత అవకాశాలు ఉన్నాయని నేపాల్ ప్రతినిధులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మంచి వాణిజ్య వసతులు కల్పిస్తే


నేపాల్ బృందంతో మాట్లాడుతున్న పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దుబే

విశాఖ పోర్టు ద్వారా రెండు లక్షల టన్నుల వరకు సరకులను నిర్వహించే వీలు కలుగుతుందని పేర్కొన్నారు.

రూ.వందల కోట్లను 'జియ్యాని' దోచుకున్నారు..

- ఆధారాలతో ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాం
- కూటమి కార్పొరేటర్లు పీతల మూర్తి యాదవ్, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాస్


మాట్లాడుతున్న కార్పొరేటర్ మూర్తియాదవ్, పక్కన టీడీపీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, మంగవేణి, తదితరులు

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్ పదవిని అడ్డం పెట్టుకుని జియ్యాని శ్రీధర్ రూ.వందల కోట్లు దోచుకున్నారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, టీడీపీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావులు ఆరోపించారు. జియ్యాని శ్రీధర్ అవినీతి, అక్రమాస్తులపై విచారణ కోసం అన్ని ఆధారాలతో రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు. జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు జియ్యాని శ్రీధర్ అవినీతిపై ఆరోపణలు గుప్పించారు. కార్పొరేటర్ కాకముందు శ్రీధర్ జీవీఎంసీలో డ్రైవర్ లేదంటే ప్రజారోగ్య విభాగంలో సూపర్‌వైజర్ పోస్టు ఇవ్వాలని కోరారని, ఇప్పుడు 22 మంది పీఏలను పెట్టుకునే స్థాయికి ఎలా ఎదిగారని ప్రశ్నించారు. ఆయనకు విజయవాడలోని కృష్ణలంకలో ఒక ఫ్లాట్, మంతెన సత్యనారాయణ స్థలానికి సమీపంలో ఫ్లాట్, బీచ్‌రోడ్డులో ఒక ఫ్లాట్, ఎంవీపీ సిటీలో మరో ఫ్లాట్, శ్రీరాం ప్రాపర్టీలో ఫ్లాట్, 52వ వార్డు శ్రీనగర్‌లో ఇంకొక ఫ్లాట్ ఎలా వచ్చాయని ప్రశ్నించారు. టిడ్కో ఇళ్లు ఇప్పిస్తానంటూ ఓ మహిళ ద్వారా భారీగా వసూలు చేశారని, ఇప్పటికీ వారికి ఇళ్లు ఇప్పించకపోగా, డబ్బులు తిరిగి ఇవ్వడానికి ఇబ్బంది పెడుతున్నారన్నారు. సామన్యులనే కాకుండా ఓ మాజీ మంత్రికి టోకరా వేసి రూ.1.5 కోట్లు, ఒక మాజీ ఎమ్మెల్యే నుంచి రూ.90 లక్షలు నొక్కేశారంటే ఆయన వ్యవహారశైలిని అర్థం చేసుకోవచ్చన్నారు. బాధితులు ఎవరైనా డబ్బులడిగితే రౌడీషీటర్లతో బెదిరించడం శ్రీధర్ ప్రత్యేకత అని వారు పేర్కొన్నారు. పోలీసులపై దౌర్జన్యాలకు పాల్పడడం వల్లే శ్రీధర్ పాస్‌పోర్టుని సీజ్ చేశారని, అందువల్లే ఇటీవల వైసీపీ కార్పొరేటర్లు పెట్టిన క్యాంపునకు విదేశాలకు వెళ్లలేదన్నారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, గొలగాని పోలారావు పాల్గొన్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి


ఢిల్లీశ్వరమ్మ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అక్కిరెడ్డిపాలెం వద్ద సర్వీస్ రోడ్డులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాతయ్యపాలేనికి చెందిన కర్రి ఢిల్లీశ్వరమ్మ (87) తన బంధువైన మరో మహిళతో కలిసి సాయంత్రం అక్కిరెడ్డిపాలెం వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు నుంచి హైవే పైకి వెళుతున్న క్రమంలో ఓ ద్విచక్ర వాహనదారుడు ఆమెను బలంగా ఢీకొన్నాడు. దీంతో ఢిల్లీశ్వరమ్మ కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం అగనంపూడి ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించిన పోలీసులు ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవరు మృతి

- ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొనడంతో దుర్ఘటన
- మృతుడు అచ్యుతాపురం మండలవాసి

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న టిప్పర్‌ను వాహనంతో ఢీకొని ఆటో డ్రైవరు మృతి చెందాడు. ఎంవీపీకాలనీ ఏఎస్ఐ ఆదిరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి గ్రామానికి చెందిన దమ్ము శ్రీను (49) ఆటో డ్రైవర్. సోమవారం తెల్లవారు జాము 2.45 గంటల సమయంలో మధురవాడ నుంచి ఆటో నడపుకుని వెళ్తుండగా.. వెంకోజీపాలెం సిగ్నల్ పాయింట్ సమీపంలో ఎలాంటి సిగ్నల్స్ లేకుండా రోడ్డు పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు దమ్ము సూరి శేఖర్ ఫిర్యాదు మేరకు సీఐ మురళీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూటు మార్చిన ఆటో డ్రైవర్

అపహరణ భయంతో ఆటో నుంచి దూకేసిన మహిళ

ప్రాణాపాయ స్థితిలో కేజీహెచ్‌లో చికిత్స


గాయాలతో తిరుపతమ్మ

మహారాణిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెల్లవారు జామున రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కిన మహిళ, డ్రైవర్ తనను అపహరించబోతున్నాడని అనుమానించి ఆటో నుంచి దూకేయడంతో తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఈ ఘటనకు సంబంధించి ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గాజువాక కుంచమాంబ వీధికి చెందిన పి.తిరుపతమ్మ (50) అనేక సంవత్సరాలుగా బొబ్బిలి వెళ్లి వస్తూ ఉండేది. మంగళవారం తెల్లవారుజామున బొబ్బిలి వెళ్లేందుకు గోపాలపట్నం రైల్వేస్టేషన్ చేరుకోవాలని గాజువాకలో ఉదయం 5.45 గంటల సమయంలో ఆటో ఎక్కింది. ఆటోలో ఎవరూ లేకపోవటం, డ్రైవర్ వేగంగా గోపాలపట్నం వైపు కాకుండా కంచి రోడ్డు మీదుగా వంటిళ్ల హోటల్ రహదారి వైపు తీసుకెళ్తున్నాడు. ఇటువైపు ఎందుకు తీసుకెళ్తున్నావు? ఆటో ఆపమని డ్రైవర్‌ను కోరింది. అయినా ఆపకుండా మరింత వేగంగా ఆటో నడపడంతో తనను అపహరిస్తున్నాడని భయపడింది. కేకలు వేస్తూ వేగంగా వెళ్తున్న ఆటోలో నుంచి బయటకు దూకేసింది. ఆమె ముఖం రోడ్డుకు నేరుగా తాకటంతో తల, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను సమీపంలోని అగనంపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితిని గమనించిన అక్కడి వైద్య సిబ్బంది వెంటనే కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని సూచించారు. తలకు తీవ్ర గాయాలు కావటంతో ప్రాణాపాయ స్థితిలో ఉంది. కేజీహెచ్ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.55 వేలు విలువైన 11 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం తనిఖీలు చేస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన లక్ష్మణ్ అధికారి, పి.రవి అనే నిందితులు గంజాయిని తెలంగాణాకు రవాణా చేస్తుండగా పట్టుబడ్డారని, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

'ఉర్సా'కు భూ కేటాయింపుల్లో భారీ అవినీతి

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉర్సా క్లస్టర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి నగరంలో భూములు కేటాయింపులో భారీ అవినీతి జరిగిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం రెండు నెలలు కిందట రిజిస్టర్ అయిన ఉర్సా క్లస్టర్‌కు నగర పరిధిలోని కాపులుప్పాడలో రూ.మూడు వేల కోట్ల విలువైన భూమిని ఎకరా 99 పైసలకు కట్టబెట్టారన్నారు. ఈ కుట్రకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూత్రధారులని ఆరోపించారు. ఈ సంస్థ పెయిడప్ క్యాపిటల్ కేవలం రూ.పది లక్షలు మాత్రమేనని, ఇద్దరు ఎన్ఆర్ఐలు డైరెక్టర్లుగా ఉన్నారన్నారు. ఈ సంస్థ రూ.5,728 కోట్లతో విశాఖలో డేటా సెంటర్ పెడతామని ముందుకువస్తే, ఎలాంటి అనుభవం లేదని తెలిసినా 56 ఎకరాల భూమిని కేటాయించి నిబంధనలను అపహాస్యం చేశారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, రవిరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ కార్పొరేటర్లపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఫిర్యాదు

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై తమ పార్టీ జారీ చేసిన విప్‌ను ధిక్కరించిన 27 మంది వైసీపీ కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు మంగళవారం ఫిర్యాదుచేశారు.

అవిశ్వాస తీర్మానంపై జరిగే కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించాలని, ఒకవేళ హాజరైనా అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేయాలంటూ వైసీపీ తమ కార్పొరేటర్లకు విప్ జారీ చేసింది. అయినప్పటికీ వైసీపీ నుంచి టీడీపీ, జనసన, బీజేపీలో చేరిన కార్పొరేటర్లు విప్‌ను ధిక్కరించి అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు. అందువల్ల వారిపై చర్యలు తీసుకోవాలంటూ అదేరోజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంతో తాజాగా మంగళవారం మరోసారి ఫిర్యాదుచేశారు.

ప్రముఖుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

సింహాచలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30న వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం నేపథ్యంలో ఆ ముందురోజు సింహాచలానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మరికొందరు రాష్ట్ర మంత్రులు చేరుకోనున్నారు. ప్రముఖుల రాక సందర్భంగా దేవదాయశాఖ చేస్తున్న ఏర్పాట్లు, పోలీసు అధికారులు చేపట్టాల్సిన నిఘా, రక్షణ ఏర్పాట్లపై పోలీసు, దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇందులో భాగంగా సింహాచల దేవస్థానం చేపడుతున్న వసతి, రవాణా, బస వంటి ప్రాథమిక సౌకర్యాలను పోలీసు ప్రత్యేక అధికారి హిమబిందు, సింహాచల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కె.సుబ్బారావుతో కలిసి సింహగిరిపై మంగళవారం పర్యటించి పరిశీలించారు. కాగా, దేవస్థానం ఈఈ ఇప్పటికే తాము రూపొందించిన ప్రణాళికలను వారికి వివరించారు. ప్రముఖుల ఆవాసం శ్రీనివాసనగర్‌లోని నూతన కల్యాణమండపాల సముదాయం లేదా నృసింహ వనంలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి కలెక్టర్ అనుమతికి సింహాచల దేవస్థానం అధికారులు ఎదురు చూస్తున్నారు.